జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం | 7 | ఏప్రిల్ | 2026 ◆ పేజీలు : 10

## ఈవీఎం గోదామును తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 6,ప్రజాజ్యోతి:** ఆర్డీవో కార్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈవీఎం గోదామును జిల్లా కలెక్టర్ అంకిత్ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాములో అమలులో ఉన్న భద్రతా ఏర్పాట్లు, పర్యవేక్షణ విధానాలను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఈవీఎంల భద్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ప్రతినెలా నిర్దిష్టంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ప్రక్రియలో భాగంగా గోదాములోని భద్రతా ప్రమాణాలను పరిశీలించడం జరుగుతుందని తెలిపారు.తనిఖీలో భాగంగా సీసీ కెమెరా నియంత్రణ గదిని సందర్శించిన కలెక్టర్, కెమెరాల పనితీరు,

మిగతా 2 లో...

- సోషల్ మీడియాతో యువతకు స్ఫూర్తి
- యువతకు మార్గదర్శకులైన ఖాకీలు
- వినూత్న సేవా మార్గంలో ముందడుగు

5 లో..



# మాధ్యమాల్లో... మార్పు మంత్రం

కాశీ రామ్–ఓం ప్రకాశ్ చైతన్య యాత్ర



## ఆమ్ బజార్.. హమారా అడ్డా..!!

- రోడ్లపైనే వ్యాపారాలు
- ట్రాఫిక్ తో జనం బేంబేలు!
- ఆమ్ బజార్ లో డ్రైనేజీ లపై కొనసాగుతున్న వ్యాపారాలు?
- నోటీసులతో మామా అనిపించుకుంటున్న అధికారులు!
- పూర్తి స్థాయి చర్యలు ఎక్కడా!
- తమ ఇస్తానుసారంగా వ్యాపారాలు చేసుడే అంటున్న వ్యాపారులు!
- అధికారులు చర్యలు తీసుకోకపోవడం వెనుక మర్మమేంటో
- చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారా
- ఉన్నతాధికారులు ఆమ్ బజార్ వ్యాపారాలపై జర దృష్టి సాధించరూ!

**ఇల్లందు, ఏప్రిల్ 6, ప్రజాజ్యోతి:** ఆమ్ బజార్.. హమారా అడ్డా... అంటూ. రోడ్లపైనే దుకాణాలు, డ్రైనేజీలపై వ్యాపారాలు, ట్రాఫిక్‌తో ప్రజలు నరకయాతన పడుతున్నారు... ఆమ్ బజార్ అంటేనే నిత్యం రద్దిగా ఉండే ప్రాంతం. ఈ ఆమ్ బజార్ లో అన్ని రకాల వ్యాపార వర్గాలు ఉండడం

మిగతా 2 లో...

## జూలూరుపాడు పీహెచ్‌సీపై కలెక్టర్ అంకిత్ ఆకస్మిక తనిఖీ



- రోగులతో నేరుగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్న జిల్లా కలెక్టర్
- అవసరమైన మందులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండాలని సూచన
- నిర్లక్ష్యం సహించబోమని వైద్య సిబ్బందికి హెచ్చరిక

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ఏప్రిల్ 6 ( ప్రజాజ్యోతి )** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూలూరుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి పరిసరాలను విభాగాల పనితీరును సమగ్రంగా పరిశీలించిన కలెక్టర్ అందిస్తున్న

మిగతా 2 లో...

## విలేకరిపై దళిత నేతల బెదిరింపులు

- ప్రజాస్వామ్యాన్ని అడ్డగిస్తున్న వైనం
- మినీ ఎస్‌బీఐ నిర్వాహకుడి హనుమంతు ప్రవర్తనపై విమర్శలు
- అట్రాసిటీ కేసుల పేరుతో బెదిరింపులకు పాల్పడుతున్న కుసపాటి

**కొత్తగూడెం, ఏప్రిల్ 6 (ప్రజాజ్యోతి):** ప్రజాస్వామ్యంలో మీడియా స్వేచ్ఛకు ఉన్న ప్రాముఖ్యతను పక్కన పెట్టి కొందరు నాయకులు బెదిరింపుల రాజకీయానికి దిగుతున్నారన్న ఆరోపణలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. వాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చిన పత్రిక విలేఖరిపై అసభ్య పదజాలంతో




విరుచుకుపడటమే కాకుండా నేరుగా బెదిరింపులకు పాల్పడిన ఘటన స్థానికంగా కలకలం రేపుతోంది. బాధిత విలేఖరి తెలిపిన వివరాల ప్రకారం కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌లో

మిగతా 2 లో...

### ఇదేం నిర్వాహణ..?

- దళిత నేతల తీరు చూస్తుంటే సిగ్గుపడాల్సిందే..!



**చుంచుపల్లి ఏప్రిల్ 5 (ప్రజాజ్యోతి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకల పేరిట నిర్వహించిన కార్యక్రమం తీవ్ర విమర్శలకు దారితీసింది. దళిత జాతి గర్వకారణమైన మహనీయుడి జయంతిని ఘనంగా నిర్వహించాల్సిన దళిత సంఘాల నేతలు మహనీయుడి చిత్రపటానికి కనీస గౌరవం కూడా ఇవ్వలేకపోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. చిత్రపటానికి వేసిన దండ నామమాత్రంగానే ఉండటం మాత్రమే కాదు దళిత నేతలు చూపించిన గౌరవం కూడా అంతే స్థాయిలో ఉందా..? అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ఇది చూస్తుంటే నిజంగానే సిగ్గుపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని దళిత వర్గాలే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. స్వాతంత్ర్య సమరయోధుడు, దేశానికి ఉప ప్రధానిగా సేవలందించిన మహనీయుడి జయంతిని ఇలా నిర్లక్ష్యంగా నిర్వహించడం సిగ్గుచేటు కాదా..? అని స్థానికులు మండిపడుతున్నారు. జయంతి అంటే పబ్లిసిటీ కోసమేనా..? కేవలం చిత్రపటం ముందు నిలబడి ఫొటోలు దిగడమేనా.. సంప్రదాయంగా చేయాల్సిన కొబ్బరికాయ కొట్టడంతో పాటు ఘన నివాళులు అర్పించడం వంటి అంశాలను పూర్తిగా పక్కనపెట్టడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. దళిత జాతి ముద్దుబిడ్డ

## ఈవీఎం గోదామును తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అంకిత్



(మొదటి పేజీ తరువాయి...)

రికార్డింగ్ వ్యవస్థలను స్వయంగా పరిశీలించారు. అన్ని కెమెరాలు నిరంతరం సక్రమంగా పనిచేసేలా చూసుకోవాలని, ఎటువంటి లోపాలు ఉన్నా వెంటనే సరిదిద్దాలని సంబంధిత అధికారులకు సూచించారు. గోదాం పరిసర ప్రాంతాన్ని ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని, భద్రతా నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. అనుమతి లేకుండా ఎవరినీ గోదాములోకి అనుమతించకూడదని, భద్రతా సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. అనంతరం గోదాం తనిఖీకి సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించి సంతకం చేశారు.ఈ తనిఖీలో ఎన్నికల సూపరింటెండెంట్ రంగ ప్రసాద్, ఎన్నికల సిబ్బంది నవీన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## మనో వేదనతో వ్యక్తి మృతి



**భద్రాచలం టౌన్ , ఏప్రిల్ 6 , ప్రజాజ్యోతి** భద్రాచలంలోని అశోక నగర్ కొత్తకాలనీకి చెందిన చుక్కా శివకుమార్‌రెడ్డి(48) మనో వేదనకు గురై అతిగా మద్యం సేవించి ఇండస్ట్రియల్ ఏరియాలో ఉన్న జామాయిల్ తోటలో మృతి చెందాడు. ఇటీవల శివకుమార్‌రెడ్డి భార్య చనిపోవడంతో తల్లితో కలిసి ఉంటున్నారు. ఈ క్రమంలో భార్య మరణంతో మనస్థాపంకు గురైన శివకుమార్‌రెడ్డి మద్యంకు బానిసాయ్యడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం ఇంట్లోనుంచి వెళ్లి మళ్లీ తిరిగి రాలేదు. గాలింపు చర్యలు చేపట్టగా జామాయల్ తోటలో మృతదేహం లభ్యమైంది. అన్న శ్రీనివాసరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఐదు గ్రామ పంచాయతీల సాధనకు ఉద్యమిద్దాం

- త్వరలో కార్యాచరణ ప్రకటిస్తాం
- రాష్ట్ర ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ వెల్లడి



**భద్రాచలం టౌన్ ఏప్రిల్ 6, ప్రజాజ్యోతి** ఏపీలో కలిసిన ఐదు గ్రామ పంచాయతీలను తిరిగి తెలంగాణలో కొనసాగించేందుకు ఉద్యోగుల పక్షాన రాబోయే రోజుల్లో అన్ని సంఘాలను, రాజకీయ పార్టీలను కలుపుకొని రాష్ట్ర వ్యాప్త ఉద్యమాలు చేపడతామని రాష్ట్ర ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ వెల్లడించింది. భద్రాచలంలోని టీఎన్జీవో కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ జేఏసీ చైర్మన్ అమరనేని రామారావు, కన్వీనరు వెంకట పుల్లయ్యలు మాట్లాడుతూ ఆంధ్రాలో కలిసిన ఐదు గ్రామ పంచాయతీలను తెలంగాణలో కలిపేందుకు ఉద్యోగుల పక్షాన రాబోయే రోజుల్లో పోరాడుతామని అన్నారు. ఇందుకు సంబంధించి త్వరలో కార్యాచరణ ప్రకటిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యుటీఎఫ్ జల్లా బాధ్యులు రాజు ప్రసాద్, భూషణరావు, ముర్ల రమేష్, అంజిబాబు, సందీప్, అన్వర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

# ఆమ్ బజార్.. హమారా అడ్డా..!!

(మొదటి పేజీ తరువాయి...)

వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడవలసి వస్తుంది. ఆ రద్దీ ప్రాంతామైన ఆమ్ బజార్ పరిస్థితి ఇది. అధికారుల కళ్లముందే నిబంధనలు ఉల్లంఘిస్తూ వ్యాపారులు ఇష్టారాజ్యంగా దుకాణాలు నిర్వహిస్తున్నా, కేవలం నోటీసుల వరకే పరిమితమవుతున్న చర్యలు ప్రజల్లో అనుమానాలకు తావిస్తున్నాయి. ప్రశ్నించాల్సిన వారు మౌనంగా ఉండటం, చూడాల్సిన వారు చూసీ చూడనట్టు వ్యవహరించడం వల్ల ఆమ్ బజార్ పూర్తిగా అక్రమాల అడ్డాగా మారిందని కండ్లకు కనిపిస్తుంది. ప్రధాన రహదారులపైకి దుకాణాలను విస్తరించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ట్రాఫిక్ జామ్‌లు రోజువారీ సమస్యగా మారి, అత్యవసర సేవలకూ ఆటంకం కలుగుతుంది. ఇక డ్రైనేజీలపై కొనసాగుతున్న వ్యాపారాల కారణంగా పారిశుద్ధ్యం దెబ్బతిని, దుర్వాసనలతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు అప్పుడప్పుడు నోటీసులు జారీ చేస్తున్నా, వాటి తర్వాత ఎలాంటి కఠిన చర్యలు కనిపించడం లేదనేది వాస్తవం. దీంతో "నోటీసులు ఇచ్చినా ఏమీ చేయరు" అనే ధీమాలో వ్యాపారులు మరింతగా రూల్స్‌ను ఉల్లంఘిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. "మా ఇష్టం వచ్చినట్టు వ్యాపారం చేస్తాం" అన్నట్టుగా పరిస్థితి తయారైంది. ఇదంతా జరుగుతుండగా చర్యలు తీసుకోవాల్సిన అధికారుల నిర్లక్ష్యం వెనుక ఏదైనా మర్మం ఉందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



### నోటీసులతోనే మామా

ఇల్లందు ఆమ్ బజార్ లో డ్రైనేజీలపైనే వ్యాపారాలు చేయడం జరుగుతుంది. మామూలుగానే ట్రాఫిక్ సమస్య ఉంటుంది. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ కావడంతో ఆ ట్రాఫిక్ మరింతగా పెరిగి ప్రజలు ఆ రోడ్డులో నడిచి వెళ్లే పరిస్థితి లేదు. అసలే చిన్న రోడ్డు ఆపై డ్రైనేజీలపైనే వ్యాపారాలు చేయడంతో పాటు మరో పక్క చిన్నపాటి తోపుడు బండ్లపై వ్యాపారాలు చేయడం మరింతగా ఇబ్బందిగా మారుతుంది. ఒక వాహనం వస్తే ఇంకో వాహనం వెళ్లాలంటే నరకయాతన పడాల్సి వస్తుందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అదేవిదంగా అదే రోడ్డులో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ప్రజలు వెళ్లేందుకు తిప్పలు తప్పడం లేదనేది వాస్తవం. అధికారులు మాత్రం కేవలం నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారా అనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జర జోక్యం చేసుకుని ఆమ్ బజార్‌లో జరుగుతున్న అక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించి, ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## విలేకరిపై దళిత నేతల బెదిరింపులు

(మొదటి పేజీ తరువాయి...)

జరిగిన బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకల సందర్భంగా వేదికపై కొంత మంది దళిత నాయకులు సముచితంగా మాట్లాడలేకపోయారన్న అభిప్రాయాలను ఒక పత్రికలో ప్రచురించడంతో ఈ వివాదం చెలరేగింది. ఈ నేపథ్యంలో కొత్తగూడెం బస్టాండ్ సెంటర్ పరిధిలోని మినీ ఎస్‌బీఐ (సీఎస్‌పీ) నిర్వాహకుడు మంద హనుమంతు, దళిత నాయకుడు కుసపాటి శ్రీనివాస్‌లు సోమవారం మధ్యాహ్నం సంబంధిత విలేఖరికి ఫోన్ చేసి అనుచిత అసభ్య పదజాలంతో దూషించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా మీది ఏ కులమో చెప్పు ఎస్సినా, ఎస్టీనా, బహుజనుడువా చెప్పు ... మీపై ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయిస్తాం అంటూ బెదిరింపులకు దిగినట్లు బాధితుడు ఆరోపించారు. ఇదే కాకుండా కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌కు రమ్మని సవాల్ విసిరినట్లు కూడా ఫోన్ సంభాషణలో ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ పరిణామం కేవలం మాటల దాడికే పరిమితం కాకుండా స్పష్టమైన బెదిరింపుల స్థాయికి చేరిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవాలను ప్రచురించినందుకు విలేఖరిని లక్ష్యంగా చేసుకోవడం ఎంతవరకు సమంజసం అన్న చర్చ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొనసాగుతోంది. బాధ్యతాయుత స్థానాల్లో ఉన్న వ్యక్తులు ఇలాంటి భాషను ఉపయోగించడం ప్రజల్లో తీవ్ర ఆందోళనకు దారితీస్తోంది. దళిత సమాజానికి న్యాయం చేస్తామని చెప్పుకునే నాయకులే ఈ విధంగా ప్రవర్తిస్తే సాధారణ ప్రజలకు న్యాయం ఎలా అందుతుందన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ప్రజా కార్యక్రమాలు నిర్వహించినప్పుడు జరిగిన పొరపాట్లపై వచ్చే విమర్శలను సహజంగా స్వీకరించకుండా దూషణలు, బెదిరింపులకు దిగడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని మేధావులు అభిప్రాయపడుతున్నారు. బాధ్యతాయుతంగా ప్రవర్తించాల్సిన నేతలు బురదలో తిరిగే జంతువుల మాదిరిగా దురుసుగా మాట్లాడటం సమాజానికి ఎంతటి చెడు సందేశం ఇస్తుందో ఆలోచించాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. నేతల తీరుతోనే సంఘం సభ్యులు నడుచుకుంటారని ఈ ధోరణి సిగ్గుసేటు అని అందువల్ల తమ ప్రవర్తనలో మార్పు అవసరమని దళిత వర్గాల నేతలు సూచిస్తున్నారు. విలేఖరిపై జరిగిన ఈ ఘటనపై జర్నలిస్టు సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. మీడియా స్వేచ్ఛను అణగదొక్కే ప్రయత్నాలను ఏమాత్రం సహించబోమని హెచ్చరిస్తున్నారు. ఇలాంటి బెదిరింపులకు సంబందించిన ఘటనలపై ఉన్నత అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# జూలూరుపాడు పీహెచ్‌సీపై కలెక్టర్ అంకిత్ ఆకస్మిక తనిఖీ

(మొదటి పేజీ తరువాయి...)

వైద్య సేవల నాణ్యతపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. మొదటగా ఇన్‌పేషెంట్ వార్డును సందర్శించిన అయన అక్కడ చికిత్స పొందుతున్న రోగులతో నేరుగా మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితి అందుతున్న చికిత్స, వైద్య సిబ్బంది స్పందనపై వివరాలు తెలుసుకున్నారు. రోగులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఔట్ పేషెంట్ విభాగాన్ని పరిశీలించి అక్కడికి వచ్చిన రోగులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఒక వృద్ధుడు తనకు ఎవరూ లేరని ప్రమాదంలో కాలు కోల్పోయినట్లు తెలియజేస్తూ సహాయం కోరగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. వెంటనే సంబంధిత అధికారులకు ఆ వృద్ధుడి పూర్తి వివరాలు సేకరించి కొత్తగూడెం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించి అవసరమైన మెరుగైన వైద్య చికిత్స అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇన్‌పేషెంట్ విభాగంలో వడదెబ్బ కేసులు నమోదవుతున్నట్లు గుర్తించి వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరాన్ని పేర్కొన్నారు. ప్రజలకు ఉపశమనం కలిగించే చర్యలలో భాగంగా మండల పరిధిలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ కార్యక్రమాలను వేగవంతం చేయాలని ఎంపీడీవోకు ఆదేశించారు. ఇప్పటికే ఆలస్యమైనందుకు కారణాలు అడిగి తెలుసుకుని తక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఆసుపత్రి లో ఔషధ నిల్వ గదిని సమగ్రంగా పరిశీలించి స్టాక్ రిజిస్టర్‌లో నమోదైన ఔషధాల వివరాలు మరియు వాస్తవ నిల్వలను సరిపోల్చి పరిశీలించారు. ఔషధాల నిల్వలు సరిపడా ఉన్నాయా లేదా అనే విషయంపై అధికారులను ప్రశ్నించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉన్న మందులు ఎంతో విలువైనవి అని వాటిని పక్కదారి పట్టకుండా కట్టుదిట్టమైన పర్యవేక్షణ ఉండాలని బహిరంగ మార్కెట్లో విక్రయాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వకూడదని స్పష్టం చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను కూడా తనిఖీ చేసి విధుల్లో ఉన్న సిబ్బంది హాజరు, వారి బాధ్యతలు సేవల సమయపాలనపై వివరాలు తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ప్రతి సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని నిర్లక్ష్యం సహించబోమని



హెచ్చరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులు ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య సేవలు అందించే ముఖ్య కేంద్రాలని ఇక్కడ అందించే సేవల నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. వైద్య సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి రోగులకు సమయానుకూలంగా సేవలు అందించాలని అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించే విధంగా సిద్ధంగా ఉండాలని సూచించారు. అవసరమైన అన్ని ఔషధాలు, వైద్య పరికరాలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందించడం ప్రభుత్వ బాధ్యత అని తెలిపారు. వేసవి కాలంలో వడదెబ్బలు, నీరసం వంటి సమస్యలు ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నందున అవసరమైన మందులు ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచుకోవాలని ప్రజలకు తగిన జాగ్రత్తలు సూచించాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట తాసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో తాళ్లూరి రవి, మెడికల్ అధికారి వెంకటేశ్వర్లు, స్టాఫ్ నర్స్, సిబ్బంది సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

- **జిల్లా కలెక్టర్ అంకిత్**



**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 6,ప్రజా జ్యోతి:**ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన ప్రతి దరఖాస్తును పరిశీలించి, వాటిని త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, గృహ నిర్మాణ శాఖాధికారి రవీంద్రనాథ్‌లతో కలిసి కలెక్టర్ ప్రజల వినతిపత్రాలను స్వయంగా స్వీకరించారు.జిల్లాలోని వివిధ మండలాలు, గ్రామాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను లిఖితపూర్వకంగా అందజేయగా వాటిని పరిశీలించిన అనంతరం కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులకు వెంటనే ఎండార్స్ చేసి తక్షణ నివేదికలు సమర్పించాలని ఆదేశించారు.

**ప్రజావాణిలో స్వీకరించిన కొన్ని దరఖాస్తులు**

కొత్తగూడెం సన్యాసి బస్తీకి చెందిన ఉమామహేశ్వరి 54 శాతం వికలాంగతతో పెన్షన్ పొందుతూ ఉండగా, గత కొన్ని నెలలుగా పెన్షన్ నిలిచిపోయినట్లు తెలిపారు. వికలాంగుల సర్టిఫికేట్ కోసం దరఖాస్తు చేసినప్పటికీ ఇప్పటివరకు పెన్షన్ పునరుద్ధరణ కాలేదని పేర్కొన్నారు. కుటుంబ పోషణ భారంగా మారిందని తెలియజేస్తూ పునరుద్ధరణ చేయాలని కోరారు. ఈ దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ తగు చర్యల కోసం డీఆర్‌డీఓకు ఎండార్స్ చేశారు.

టేకులపల్లి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన బానోతు తోలచంద్ తనకు కంపార్ట్‌మెంట్ నెం. 17లో 5.19 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నప్పటికీ ఆర్ ఓ ఎఫ్ ఆర్ పట్టా బుక్ ఇప్పటివరకు అందలేదని తెలిపారు. ఈ దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ తగు చర్యల నిమిత్తం జిల్లా అటవీ శాఖ అధికారికి ఎండార్స్ చేశారు.

సుజాతనగర్‌కు చెందిన నునావత్ కుమార్ రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకొని నాలుగు నెలలు గడిచినా మంజూరు కాలేదని, కుటుంబ పోషణ కష్టంగా మారిందని తెలిపారు. ఈ దరఖాస్తును పరిశీలించి తగు చర్యల కోసం జిల్లా పౌర సరఫరాల అధికారికి ఎండార్స్ చేశారు.

ఇల్లందు మండలం మర్రిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని పది గ్రామాల ఆదివాసీ ప్రజలు ప్రభుత్వ వైద్యశాల లేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలియజేశారు. ముఖ్యంగా రాత్రివేళ వృద్ధులు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలుపుతూ,గ్రామంలో వైద్యశాల ఏర్పాటు చేయాలని కోరగా, ఈ దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి ఎండార్స్ చేశారు.

ఇల్లందు మండలం అశోక్‌నగర్ గ్రామానికి చెందిన ఎల్లబోయిన రాణి పీజీ వరకు చదివి నిరుద్యోగిగా ఉన్నానని, ఔట్‌సోర్సింగ్‌లో ఉపాధి కల్పించాలని కోరారు. ఈ దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారికి ఎండార్స్ చేశారు.

ప్రజావాణి కార్యక్రమం అనంతరం జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పాఠశాలలు, వసతి గృహాలలో మెనూ ప్రకారం ఆహారం అందించడం జరగడం లేదని గుర్తించినట్లు తెలిపారు. మండల ప్రత్యేక అధికారులు, పాఠశాలలు , వసతి గృహాల పర్యవేక్షణ అధికారులు జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని విద్యాసంస్థలపై ప్రత్యేక దృష్టి సారించి పర్యవేక్షణ చేపట్టాలని, ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. వారం లోపు జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ఉన్న లోపాలను గుర్తించి సరిచేయాలని స్పష్టమైన సూచనలు ఇచ్చారు. అలాగే ప్రజావాణి కార్యక్రమానికి మండల ప్రత్యేక అధికారులు హాజరు కాకపోవడంపై గల కారణాలు ఆరా తీసి , ఇకపై తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులు తక్షణ చర్యలు తీసుకుని స్పందించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అన్ని శాఖలకు చెందిన జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఈనెల 8న దిశా సర్వసభ్య సమావేశం

- **కలెక్టర్ అంకిత్**



**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 6,ప్రజా జ్యోతి:**జిల్లాలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు, పురోగతిపై సమగ్ర సమీక్ష కోసం ఈనెల 8న బుధవారం దిశా సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8వ తేదీ ఉదయం 11.00 గంటలకు ఐడీఓసీ కార్యాలయంలో ఈ సమావేశం జరుగుతుందని తెలిపారు .ముందుగా ఈ సమావేశాన్ని మధ్యాహ్నం 3.00 గంటలకు నిర్వహించాలని నిర్ణయించగా, పరిపాలనా కారణాల వల్ల సమయాన్ని సవరించి ఉదయం 11.00 గంటలకు మార్చినట్లు తెలిపారు. సంబంధిత అధికారులు, సభ్యులు ఈ మార్పును గమనించి సమయానికి హాజరు కావాలని సూచించారు.ఈ సమావేశం ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురామ రెడ్డి అధ్యక్షతన జరగనుండగా, కో–చైర్మన్‌గా మహబూబాబాద్ పార్లమెంటు సభ్యులు పోరిక బలరాం నాయక్ పాల్గొంటారని తెలిపారు, అదేవిధంగా అదే విధంగా శాసనమండలి సభ్యులు, శాసనసభ్యులు, మున్సిపల్ మేయర్స్ , దిశా కమిటీ సభ్యులు, సంబంధిత అన్ని శాఖల జిల్లా అధికారులు హాజరవుతారని తెలిపారు.జిల్లాలో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాల పురోగతి, నిధుల వినియోగం, లక్ష్యాల సాధన, లబ్ధిదారులకు అందుతున్న సేవలపై విస్తృతంగా చర్చించనున్నట్లు కలెక్టర్ తెలిపారు, కావున అన్ని శాఖల అధికారులు తమకు సంబంధించిన కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రగతి నివేదికలు, వివరాలతో సమావేశానికి సిద్ధంగా హాజరు కావాలని ఆదేశించారు.

# ఇల్లందు ఏరియా ఫాస్టర్ ఫెలోషిప్ నూతన కమిటీ ఎన్నిక



**ఇల్లందు, ఏప్రిల్ 6, ప్రజాజ్యోతి:** ఇల్లందు ఏరియా పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశం సోమవారం సుభాష్ నగర్ లోని రాక్ చర్చి లో బిషప్ సిహెచ్ శివాజీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో ఇల్లందు ఏరియా పాస్టర్ ఫెలోషిప్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షునిగా బిషప్ సిహెచ్ శివాజీ, అధ్యక్షునిగా ఫాస్టర్ కె ఆదాము, ప్రధాన కార్యదర్శిగా బిషప్ తాళ్లూరి రత్న ప్రభు, కోశాధికారిగా రెవ. పి జ్ఞానముత్యం, ఉపాధ్యక్షులుగా పాస్టర్ జి ప్రసాద్, రెవ. జి జూన్సన్, గౌరవ సలహాదారు రెవ. టి స్వామిదాసు, కార్యనిర్వహణ కార్యదర్శిగా రెవ, డి జయరాజు, కార్యదర్శులుగా ఫాస్టర్ బి భాస్కర్, రెవ. ఈ మహేంద్రపాల్, కార్యనిర్వాహక సభ్యునిగా పాస్టర్ కె ఆనంద్ బాబు లను ఎన్నుకున్నారు. ప్రతినెల మొదటి సోమవారం సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

# రైతులకు మరింత అవగాహన కల్పించాలి



**ఇల్లందు, ఏప్రిల్ 6, ప్రజాజ్యోతి:**ఇల్లందు మార్కెట్ పరిధిలోని రైతులందరికి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వద్ద అమ్మకాలు జరిపే విధంగా అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య సూచించారు. సోమవారం ఇల్లందు వ్యవసాయ మార్కెట్ లో జరిగిన పాలకవర్గం సమావేశం నిర్వహించారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు మద్దతు ధర ఇవ్వడం జరుగుతుందని, రైతులు దళారులను నమ్మి నష్టపోవద్దని కోరారు. అదేవిధంగా వ్యవసాయ మార్కెట్ కు మరింత ఆదాయం పెరిగేందుకు పాలకవర్గం, అధికారులు, సిబ్బంది నిరంతరం కృషి చేయాలన్నారు. అనంతరం మార్కెట్ పరిధిలోని ఆదాయ, వ్యయాలపై డైరెక్టర్లకు చైర్మన్ వివరించారు. మార్కెట్ పరిధిలో చేపట్టవలసిన నూతన పనులకు పాలకవర్గం తీర్మాణం చేయడం జరిగింది. ఇల్లందు వేస్తే మార్కెట్ పరిధిలోని గార్ల, బయ్యారం మండలాలలో నూతన చెక్ పోస్ట్ ల ఏర్పాటుకు ఏకగ్రీవ అమోదం తెలిపారు. ఇల్లందు మార్కెట్ లో ప్రహరి నిర్మాణం, హమీల సంఖ్య పెంపు, మార్కెట్ ఉదోగ్యుల సంఖ్య పెంపుపై కూడా తీర్మానం చేశారు. సింగరేణి మండలం అప్పాయిగూడెం గౌడౌన్ రహదారి విషయంపై వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ను కలిసి సమస్య పరిష్కరించాలని చర్చించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, ఇల్లందు మున్సిపాలిటి చైర్ పర్సన్ దొడ్డా కిరణ్ మిత్ర డానియల్, మార్కెట్ స్పెషల్ ఆఫిసర్ నరేందర్, మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ బిజ్జా వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు జారా సమ్మక్క, గుగులోత్ గబ్రు నాయక్, మాళోత్ బావుసింగ్, బొల్లి రాజు, కుంజా వసంతరావు, జిగట వెంకన్న, బానోత్ జింకు, మార్కెట్ సిబ్బంది పాల్గోన్నారు.

# జెకె5 ఓసీ కొనసాగింపు నిర్వాసితులకు న్యాయం చేయాలి

**ఇల్లందు, ఏప్రిల్ 6, ప్రజాజ్యోతి:**జెకె5 ఓసీ కొనసాగింపు నిర్వాసితులకు న్యాయం చేయాలని సోమవారం ఐడిఓసి లో సర్పంచులు, అఖిలపక్ష నాయకులు జాయింట్ కలెక్టర్ వేణుగోపాల్ కు వినతి పత్రం అందజేశారు. నిర్వాసితులకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగిన తర్వాతనే ఇండ్లను ఖాళీ చేస్తామని తెలిపారు. తమ ముత్తాతలు, తాతలు, తండ్రులు సింగరేణి కి సేవలందించి రిటైర్డ్ ఇక్కడే నివాసం ఉంటున్న మమ్మల్ని తక్షణమే ఖాళీ చేయాలని ఎలాంటి నష్టపరిహారం ఇవ్వమని సింగరేణి యాజమాన్యం తమపై ఒత్తిడి తీసుకొచ్చి భయభ్రాంతులకు గురి చేస్తుందని పేర్కొన్నారు. తక్షణమే ఈ సమస్యపై స్పందించి తమకు న్యాయం చేయాలని జాయింట్ కలెక్టర్ ను కోరారు. దాదాపు 130 ఏళ్ల తరబడి ఇక్కడే నివాసం ఉంటున్నామని, ఇక్కడున్న ప్రజలందరూ మాజీ కార్మికుల కుటుంబ సభ్యులేనని, ఆనాడు సింగరేణి కి సేవలు అందించి, ఎటు వెళ్లలేని పరిస్థితిలో ఇక్కడే నివాసముండిపోయారని గుర్తు చేశారు. దాదాపు 20, 30 సంవత్సరాల నుండి ఈ ప్రాంతాలను సింగరేణి ఎలాంటి అభివృద్ధి చేయకుండా నిర్లక్ష్యానికి గురి చేసిందని, ప్రాజెక్టు కోసమని మా స్థలం మాకు కావాలని దౌర్జన్యానికి పాల్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. జెకె5 ఓసి కొనసాగింపులో భాగంగా 21 ఫిట్ ఏరియా నిర్వాసిత ప్రాంతాలైన ( విజయలక్ష్మి నగర్, తిలక్ నగర్) పంచాయతీలను ఉన్నపలంగా ఖాళీ చేయాలని ఎలాంటి నోటీసులు, సమాచారం లేకుండా ఖాళీ చేయమని సింగరేణి అధికారులు ఇంటింటికి తిరుగుతూ చెబుతున్నారని పేర్కొన్నారు. గతంలో చట్ట ప్రకారం మాకు రావలిసినవి ఇవ్వాలని అఖిలపక్షం చేపిందన్నారు. నిర్వాసితులకు రావాల్సిన నష్టపరిహారం వచ్చిన తర్వాతనే ఖాళీ చేస్తామని స్పష్టంగా సింగరేణి యాజమాన్యానికి తెలియజేయడం జరిగిందని తెలిపారు. సింగరేణి అఖిలపక్ష కమిటీ దగ్గరకు వచ్చి సహకరించాలని కోరినప్పుడు ప్రాజెక్టు స్వాగతిస్తూనే ప్రజలకు న్యాయం చేయాలని చెప్పిన కొన్ని డిమాండ్లను వారు అంగీకరించి మా సహకారంతో సర్వే మొత్తం పూర్తి చేసుకొని ప్రస్తుతం ఆ మాటలను తుంగలో తొక్కి వెంటనే ఖాళీ చేయాలని హుకుం జారీ చేస్తున్నారన్నారు. స్పందించిన జాయింట్ కలెక్టర్ పూర్తి వివరాలతో రావాలని సింగరేణి వారికి లెటర్ పంపిస్తామని అన్నారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు చాందావత్ రమేష్ బాబు, దనసరి స్రవంతి, అఖిలపక్ష నాయకులు తాండ్ర నాగరాజు, ఎట్టి హరికృష్ణ, వడ్ల శ్రీను, క్లింట్ రోచ్, తేజవత్ లాలు, సదారం చిన్నారి, ధనసరి రాజు, బానోత్ హరిసింగ్ తదితరులు పాల్గొన్నారు.



# అంబేద్కర్ విగ్రహాల ఏర్పాటుకు అనుమతి కోరుతూ కలెక్టర్‌కు వినతి



**ఆళ్ళపల్లి. ఏప్రిల్6. ప్రజా జ్యోతి**ఆళ్లపల్లి మండల కేంద్రంలోని సర్వే నంబర్ 484 లో గల కొమరం భీమ్ కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో ఆదివాసీల ఆరాధ్య దైవం కొమరం భీమ్ మరియు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాల నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని ఆదివాసీ ఐక్య కార్యాచరణ సమితి జిల్లా కలెక్టర్‌ను కోరింది. ఆదివాసీ ఐక్య కార్యాచరణ సమితి మండల అధ్యక్షులు పాయం రమేష్ ఆధ్వర్యంలో నాయకులు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు రమేష్ తెలిపారు.2015 నుండి ఈ స్థలంలోనే ప్రపంచ ఆదివాసీ దినోత్సవం, కొమరం భీమ్, బిర్సా ముండా వర్ధంతి సభలను నిర్వహిస్తున్నారు. ఈ మహనీయుల విగ్రహాల ద్వారా యువతలో చైతన్యం నింపడం, సామాజిక న్యాయం, సమానత్వం వంటి రాజ్యాంగ విలువలను పెంపొందించడమే ప్రధాన ఉద్దేశమని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొమరం వెంకట కృష్ణంరాజు, గొగ్గల గాదెరాజు, ఏదూళ్ళ రమేష్, కొమరం సతీష్, కొమరం బన్ని తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఎన్నారై దంపతులు స్పోర్ట్స్ టీ-షర్ట్స్ పంపిణీ



**ఇల్లందు, ఏప్రిల్ 6, ప్రజాజ్యోతి:** తమ కుమార్తె నైరా పుట్టినరోజును పురస్కరించుకోని ఆడంబరాలకు పోకుండా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అండగా నిలిచి ఎన్నారై దంపతులు తమ ఉదారతను చాటుకున్నారు. కారేపల్లి నివాసి అమెరికాలో స్థిరపడిన ఎన్నారై బానోత్ వంశీకృష్ణ – దివ్య దంపతుల కుమార్తె నైరా పుట్టినరోజు సందర్భంగా యంపిపిఎస్ మొహల్లా నంబర్ 16 పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు సోమవారం స్పోర్ట్స్ టీ–షర్ట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ కుమార్తె నైనా పుట్టినరోజును పురస్కరించుకొని విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్ లను పంపిణీ చేశామన్నారు. అనంతరం మండల విద్యాధికారి యం ఉమా శంకర్ మాట్లాడుతూ విదేశాల్లో ఉన్నప్పటికీ పుట్టిన గడ్డపై ప్రేమతో పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి సహకరిస్తున్న బానోత్ వంశీకృష్ణ గొప్పతనాన్ని కొనియాడారు. విద్యార్థులు అందరూ ఉన్నత స్థాయికి చేరుకుని దేశ సేవలో ముందుండాలని కోరారు. అనంతరం పుట్టినరోజు జరుపుకుంటున్న చిన్నారి నైరాకు వారు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మ, ఇల్లందు ఎస్ఐ సమ్మిరెడ్డి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా బీజేపీ 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

- జిల్లా వ్యాప్తంగా జెండా ఆవిష్కరణలు



**చుంచుపల్లి , ఏప్రిల్ 6 ( ప్రజాజ్యోతి )** భారతీయ జనతా పార్టీ (బీజేపీ) 47వ ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తగూడెం, పాల్వంచ, లక్ష్మీదేవి పల్లి, చుంచుపల్లి మండల కేంద్రాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రముఖ న్యాయవాది, ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర నాయకులు జి.వి.కె. మనోహర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపక దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం ఏప్రిల్ 6న జరుపుకుంటారని తెలిపారు. 1980 ఏప్రిల్ 6న జనతా పార్టీ నుండి విడిపోయిన అనంతరం అటల్ బిహారీ వాజ్‌పేయి, ఎల్.కే. అద్వానీ వంటి ప్రముఖ నాయకులు బీజేపీని స్థాపించినట్లు పేర్కొన్నారు. పార్టీ చరిత్ర, సిద్ధాంతాలను గుర్తు చేసుకునే ఈ రోజు ప్రతి కార్యకర్తకు ప్రేరణగా నిలవాలని అన్నారు. దేశ నిర్మాణంలో నిస్వార్థంగా పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జాటోత్ వెంకట్, బలగం శ్రీధర్, దురుశెట్టి కుమార్, జుజ్జూరు మోహనకృష్ణ, ఎస్.కె. సలీం, నవీన్ కుమార్, జల్లరాపు శ్రీనివాస్, రామారావు, కిరణ్, విరగోని రమణ, చిన్ని, నవీన్, రవి చంద్, సుధాకర్, రాకేష్, శ్రీను, ఎరువని రమణ, రాధాకృష్ణ, మహిళా నాయకురాలు సముద్రాల గాయత్రి, ఇస్లావత్ విష్ణు ప్రియ, భూక్యా స్వాతి పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, స్థానికులు హాజరయ్యారు.

# ఇసుక ట్రాక్టర్ పట్టివేత

**బూర్గంపహాడ్, ఏప్రిల్ 6 (ప్రజా జ్యోతి ):** అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ ను బూర్గంపహాడ్ పోలీసులు సోమవారం పట్టుకున్నారు. దీనికి సంబంధించి ఎస్సై మేడా ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం... మండల కేంద్రంలోని కిన్నెరెసాని వాగు నుంచి ఇసుక లోడ్ చేసుకుని వస్తున్న ట్రాక్టర్ను కొల్లు సమీపంలో ఎస్సై సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. పట్టుబడిన ఇసుక ట్రాక్టర్ను తహశీల్దార్ కార్యాలయానికి అప్పగించినట్లు తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తే చట్టపరమైన చర్యలు తీఉసకుంటామని హెచ్చరించారు.

## విపత్తులపై అవగాహన

# సన్నద్ధతతోనే ప్రాణ, ఆస్తి నష్టం నివారణ

- జిల్లా కలెక్టర్ అంకిత్






**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 6,ప్రజా జ్యోతి:**
విపత్తులపై సరైన అవగాహనతో పాటు ముందస్తు సన్నద్ధత ఉంటేనే ప్రాణ, ఆస్తి నష్టాలను గణనీయంగా తగ్గించవచ్చని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. సామాజిక చైతన్యం లక్ష్యంగా జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్‌డీఆర్ఎఫ్) ఆధ్వర్యంలో జిల్లాలో నిర్వహించనున్న ఫెమిలియరైజేషన్ ఎక్సర్‌సైజ్ (ఫామెక్స్)–2026 కార్యక్రమాలను సమర్థంగా అమలు చేయాలని సూచించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో ఎన్‌డీఆర్ఎఫ్ ఫామెక్స్–2026 నిర్వహణపై జిల్లా స్థాయి సమన్వయ శాఖల అధికారులతో, అదనపు కలెక్టర్ వేణుగోపాల్ తో కలసి జిల్లా కలెక్టర్ అంకిత్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎన్‌డీఆర్ఎఫ్ 10వ బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ బిటన్ సింగ్ సారథ్యంలో బృంద సభ్యులు పాల్గొన్నారు. జిల్లా భౌగోళిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వరదలు వంటి విపత్తులకు గురయ్యే ప్రాంతాలను గుర్తించడం, ఆయా ప్రాంతాల్లో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు, జిల్లా విపత్తు నిర్వహణ ప్రణాళిక (డీడీఎంపీ) అమలు, రెవెన్యూ, అగ్నిమాపక, పంచాయతీరాజ్, పోలీస్, రవాణా, ఆర్ & బీ, ఇరిగేషన్, వ్యవసాయం తదితర శాఖల సమన్వయంపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజల్లో విపత్తులపై అవగాహన పెంపొందించేందుకు, ఎన్‌డీఆర్ఎఫ్ పాత్రను ప్రజలకు చేరవేయేందుకు ఫామెక్స్ కార్యక్రమాలు కీలకమని అన్నారు . షెడ్యూల్ ప్రకారం రేపటి నుండి 15 రోజుల పాటు గోదావరి పరివాహక ప్రాంతంలో వరద ప్రభావిత ప్రాంతాలు, పాఠశాలలు, కళాశాలలు, పరిశ్రమలలో అవగాహన, సన్నద్ధత కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ (ఎన్‌వైకేఎస్), ఆపద మిత్ర, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు, ప్రజాప్రతినిధుల సహకారంతో ఈ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వివరించారు.ఈ కార్యక్రమాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి స్థాయిలో చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఎన్‌డీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే ఫామెక్స్ కార్యక్రమాల ద్వారా ప్రజల్లో భద్రతా చైతన్యం పెరుగుతుందని, విపత్తుల సమయంలో ప్రాణ, ఆస్తి నష్టాలను గణనీయంగా తగ్గించవచ్చని ఎన్‌డీఆర్ఎఫ్ 10వ బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ బిటన్ సింగ్ తెలిపారు. విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రక్షణ చర్యలు, అత్యవసర పరిస్థితుల్లో స్పందించే విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. ముఖ్యంగా ప్రాథమిక చికిత్స, నేలకూలిన నిర్మాణాల్లో శోధన మరియు రక్షణ చర్యలు, రసాయన , జీవ విపత్తులకు స్పందన, అగ్ని ప్రమాదాలు, తుపాన్లు, భూకంపాలు వంటి పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేకంగా శిక్షణ అందించనున్నట్లు తెలిపారు.ఈ సమావేశం లో జడ్ పి సి ఈ ఓ నాగలక్ష్మి, సి పి ఓ సంజీవరవు, వైద్య శాఖ అధికారి తుకారాం రాతోడ్, విద్యుత్ శాఖ ఎస్ ఈ మహీందర్,ఎన్‌డీఆర్ఎఫ్ సభ్యులు గోవిందరావు, జగదీష్, రంజిత్, ఎస్ డి ఆర్ ఎఫ్ సభ్యులు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఏజెన్సీ ప్రాంత అభివృద్దే మా ప్రధాన లక్ష్యం

- భద్రాచలం ఏఎస్పి విక్రాంత్ కుమార్ సింగ్





**చర్ల, ఏప్రిల్ 06: (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో సోమవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు చర్ల,దుమ్ముగూడెం మండలాల్లోని పలు ఏజెన్సీ గ్రామాల్లో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ కమ్యూనిటీ హాళ్ళను ప్రారంభించారు .చర్ల మండలంలోని ఏజెన్సీ గ్రామాలైన కుర్నపల్లి,బత్తినపల్లి,చెన్నాపురం దుమ్ముగూడెం మండలంలోని చింతగుప్ప,ముల్కనపల్లి ఏజెన్సీ గ్రామాల్లో నివసించే ఆదీవాసీ ప్రజలకు పలు కార్యక్రమాలకు ఉపయోగపడే విధంగా నిర్మించిన కమ్యూనిటీ హాళ్ళను భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ప్రారంభించారు. చర్ల మండలం బట్టిగూడెంలో జరిగిన గ్రామోత్సవ సభలో పోలీస్ అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సారథ్యంలో ఏజెన్సీ ప్రాంత వాసుల అభివృద్దే లక్ష్యంగా పోలీస్ శాఖ పనిచేస్తుందని అన్నారు.ముఖ్యంగా చర్ల,దుమ్ముగూడెం మండలాల్లోని ప్రతి ఏజెన్సీ గ్రామానికి విద్య,వైద్యం,రవాణా సౌకర్యాలను అందించే విధంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు.ఇందులో భాగంగానే వారికి కమ్యూనిటీ హాళ్ళను అందించడం జరిగిందని తెలిపారు. ఈ ప్రాంతాల్లో నివసించే ప్రజలు ఎలాంటి సమస్యలున్న పోలీసు శాఖ దృష్టికి తీసుకువస్తే,సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో చర్ల సిఐ రాజువర్మ,దుమ్ముగూడెం సిఐ వెంకటప్పయ్య,ఎస్సైలు నర్సిరెడ్డి,కేశవ,సీఆర్పీఫ్ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా బుడియా బాపు జాతర

- బంజారా సంస్కృతికి అద్దం పట్టిన జాతర వేడుకలు
- సాధువుల ప్రత్యేక పూజలు ఆకట్టుకున్నాయి
- బంజారా ఆచారాలను కాపాడుకోవాలి: జేఏసీ వైస్ చైర్మన్ బానోత్ వీరు నాయక్



**లక్ష్మీదేవిపల్లి, ఏప్రిల్ 6 ( ప్రజాజ్యోతి )** బంజారాల సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకుంటూ తరతరాలకు అందించాలని బంజారా సంఘాల జేఏసీ వైస్ చైర్మన్ బానోత్ వీరు నాయక్ అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండలం మునియా తండాలో సోమవారం ఘనంగా నిర్వహించిన బుడియా బాపు జాతరలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంజారాల ఆచారాలు, సంప్రదాయాలు వారి అస్థిత్వానికి ప్రతీకలని వాటిని నిర్లక్ష్యం చేయకుండా ప్రతి ఒక్కరూ పాటించాలని పిలుపునిచ్చారు. బట్టు సోమిలి, నాను దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ జాతరలో సాధువులు భజనలు, పూజలు నిర్వహించి భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగించారు. భోగ్ బండారో కార్యక్రమం భక్తుల సందడిలో ఘనంగా జరిగింది. మహబూబాబాద్ జిల్లా మన్యగూడెం బుడియా బాపు ఆలయం నుండి రాగు సాదు, శిష్య బృందం విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రతి ఏడాది ఈ జాతరను నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా గణేష్ మహారాజ్ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రఘు సాదు, బాలాజీ సాదు, వాళ్లు సాదు, సక్రాం సాదు, మీటీయా సాదు, రెడ్డి సాదు, భద్రు సాదు, అనూష మాత తదితరులు పాల్గొన్నారు.









# మాధ్యమాల్లో... మార్పు మంత్రం

- సోషల్ మీడియాతో యువతకు స్ఫూర్తి
- యువతకు మార్గ దర్శకులైన ఖాకీలు
- వినూత్న సేవా మార్గంలో ముందడుగు

**కాశీ రామ్–ఓం ప్రకాశ్ చైతన్య యాత్ర**

**ఖాకీ అంటే కేవలం చట్టాన్ని అమలు చేయడం మాత్రమే కాదు... సమాజాన్ని సురక్షితంగా నిలబెట్టడం, ప్రజల్లో నమ్మకం నాటడం, అవసరమైనప్పుడు దారి చూపడం కూడా అంతే ప్రధాన బాధ్యత. పగలు–రాత్రి తేడా లేకుండా విధుల్లో నిమగ్నమై ఉండే ఈ వృత్తిలోనూ కొందరు అధికారులు తమకంటూ ప్రత్యేక ముద్ర వేస్తున్నారు. సోషల్ మీడియాను సద్వినియోగం చేసుకుని యువతలో చైతన్యం నింపుతూ, చెడు అలవాట్లకు అడ్డుకట్ట వేస్తూ సన్మార్గం వైపు నడిపిస్తున్నారు. ఈ కోవలో కాశీరామ్ బానోత్, ఓం ప్రకాశ్ ముందంజలో నిలుస్తున్నారు. ఈ నేపథ్యంలో సదరు పోలీస్ అధికారుల చైతన్య యాత్రపై ప్రజాజ్యోతి అందిస్తున్న ప్రత్యేక కథనం....**

భూక్యా రంజిత్ నాయక్,
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి

ఖాకీ అంటే కేవలం చట్టాన్ని అమలు చేయడం మాత్రమే కాదు... సమాజాన్ని సురక్షితంగా నిలబెట్టడం, ప్రజల్లో నమ్మకం నాటడం, అవసరమైనప్పుడు దారి చూపడం కూడా అంతే ప్రధాన బాధ్యత. పగలు–రాత్రి తేడా లేకుండా విధుల్లో నిమగ్నమై ఉండే ఈ వృత్తిలోనూ కొందరు అధికారులు తమకంటూ ప్రత్యేక ముద్ర వేస్తున్నారు. సోషల్ మీడియాను సద్వినియోగం చేసుకుని యువతలో చైతన్యం నింపుతూ, చెడు అలవాట్లకు అడ్డుకట్ట వేస్తూ సన్మార్గం వైపు నడిపిస్తున్నారు. ఈ కోవలో కాశీరామ్ బానోత్, ఓం ప్రకాశ్ ముందంజలో నిలుస్తున్నారు.

### »» సోషల్ మీడియాలో స్ఫూర్తి ప్రవాహం

సాంకేతిక యుగంలో యువత ఎక్కువ సమయం గడిపే సోషల్ మీడియానే చైతన్య వేదికగా మలచుకున్నారు ఈ ఇద్దరు అధికారులు. చిన్న వీడియోలు, సరళమైన మాటలతో పెద్ద సందేశాలను చేరవేస్తున్నారు. "చదువుతోనే జీవితం మారుతుంది", "జీవితం నీది... దాన్ని నువ్వే తీర్చిదిద్దుకో" వంటి మాటలతో యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తున్నారు. సేవాభావం, క్రమశిక్షణ, లక్ష్య సాధన ప్రాముఖ్యతను స్పష్టంగా చాటి చెబుతున్నారు.



### »» పోరాటం నుంచి పాఠంగా కాశీరామ్

మారుమూల గిరిజన తండాలో పేదరికంలో పెరిగిన కాశీరామ్ బానోత్ జీవితం పోరాటానికి ప్రతీక. కూలిపని చేస్తూ చదువు కొనసాగించి పోలీస్ అధికారిగా ఎదిగిన ఆయన, "చదువు మార్గమే జీవితాన్ని మార్చే శక్తి" అని తన అనుభవంతోనే నిరూపించారు. కష్టాలను మెట్లుగా మలుచుకుని ముందుకు సాగితే విజయమే సాధ్యమని యువతకు ప్రేరణగా నిలుస్తున్నారు.

### »» సంకల్పమే శక్తి... ఓం ప్రకాశ్ సేవా పథం

ములుగు జిల్లా మంగపేట మండలానికి చెందిన ఓం ప్రకాశ్ యువతలో అవగాహన పెంపొందించడంలో ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ట్రాఫిక్ నిబంధనలు, హెల్మెట్ వినియోగం, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పిస్తూ యువతను అప్రమత్తం చేస్తున్నారు. గంజాయి, మద్యం, బెట్టింగ్ వంటి వ్యసనాల నుంచి దూరంగా ఉండాలని సూచిస్తున్నారు.

### »» సామాజిక చైతన్యానికి ప్రాధాన్యం

మూఢనమ్మకాలు, అనవసర గొడవలు, చెడు అలవాట్లపై హెచ్చరిస్తూ సమాజంలో సానుకూల మార్పు తీసుకురావడంలో కృషి చేస్తున్నారు. చిన్న చిన్న సూచనల ద్వారా కూడా పెద్ద మార్పు సాధ్యమని చూపిస్తున్నారు. పిల్లల భద్రత నుంచి మూగజీవాల సంరక్షణ వరకు పలు అంశాలపై చైతన్యం కలిగిస్తున్నారు.







### »» మహిళలు, గురువుల పట్ల గౌరవం

బాలికల విద్య, మహిళల గౌరవం, గురువుల పాత్రపై ప్రత్యేకంగా సందేశాలు ఇస్తున్నారు. కుటుంబం, సమాజం బలపడాలంటే మహిళలు బలంగా ఉండాలని, గురువుల పట్ల గౌరవం ఉండాలని సూచిస్తున్నారు.

### »» యువతకు స్పష్టమైన దిశ

"లక్ష్యం ఉన్నవారే జీవితంలో నిలుస్తారు" అనే భావనను నూరిపోస్తూ కష్టపడి చదవాలని, తల్లిదండ్రులకు గర్వకారణం కావాలని యువతను ప్రోత్సహిస్తున్నారు. అపజయాలను భయపడకుండా ముందుకు సాగాలని సూచిస్తున్నారు.

### »» ఖాకీతో మార్పుకు నాంది

విధి నిర్వహణతో పాటు సమాజ శ్రేయస్సు కోసం కృషి చేస్తున్న కాశీరామ్–ఓం ప్రకాశ్ వంటి అధికారులు నిజంగా అభినందనీయం. సోషల్ మీడియాను చైతన్య వేదికగా మలుచుకుని యువతలో మార్పు తీసుకురావడంలో వారు చేస్తున్న కృషి ఖాకీ వ్యవస్థకు కొత్త దిశను చూపుతోంది. "మార్పు మన నుంచే మొదలు" అనే సందేశాన్ని కార్యరూపంలో చూపిస్తున్న ఈ ఇద్దరు అధికారులు యువతకు నిజమైన మార్గదర్శకులు. వారి స్ఫూర్తితో ముందుకు సాగే యువత పెరిగితే సమాజ భవిష్యత్తు మరింత వెలుగొందడం ఖాయం.

## కొత్తగూడెంలో తైక్వాండో కలర్ బెల్ట్ పరీక్షలు విజయవంతం



**కొత్తగూడెం , ఏప్రిల్ 6 ( ప్రజాజ్యోతి )** తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి ఏ. ప్రవీణ్ కుమార్ మార్గదర్శకత్వంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో కొత్తగూడెంలోని సిఈఆర్ క్లబ్‌లో తైక్వాండో కలర్ బెల్ట్ గ్రేడ్ పరీక్షలు విజయవంతంగా నిర్వహించబడ్డాయి. ఈ పరీక్షల్లో పాల్గొన్న విద్యార్థులు తమ ప్రతిభను చాటుతూ వివిధ బెల్ట్‌లకు అర్హత సాధించారు. గ్రీన్ బెల్ట్‌కు భవదీప్, భవిత, రాహిత్య, రాణి, యువన్ చంద్రలు ఎంపికయ్యారు. బ్లూ బెల్ట్‌కు రామ్ వికాస్, అక్షయ్, లక్ష్మీ, ప్రణతి, ప్రణవి అర్హత సాధించగా, రెడ్ బెల్ట్‌కు భవిష్ చంద్ర, మిథున్ రాజ్ , భవిజ్ఞ, అమృత, వర్షిని ఎంపికయ్యారు. విజేతలను అభినందిస్తూ జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షులు ఎం.డి. మక్బూల్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శి ఎల్ . రమేష్‌కుమార్, ట్రెజరర్ ఎస్.కె. యాకుబ్ పాషా, సభ్యులు రవి కిరణ్ పాల్గొన్నారు.మరియమ్మ, రాము, క్లింట్ లు జిల్లా తైక్వాండో అసోసియేషన్‌లో చేరడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. తైక్వాండో క్రీడ అభివృద్ధి కోసం తమ వంతు కృషి చేస్తామని తెలిపారు.

## కార్మిక సమస్యలపై ఐటీసీ స్పందించక పోతే సమ్మెబాట పడతాం

- కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ డిమాండ్




**బూర్గంపహాడ్, ఏప్రిల్ 6 (ప్రజా జ్యోతి ):** కాంట్రాక్టు కార్మికులు ఎదుర్కొంటున్న న్యాయమైన డిమాండ్లను ఐటీసీ యాజమాన్యం పరిష్కరించకపోయినా... చర్చలకు పిలవకపోయినా రిలేదీక్షలు కాస్తా సమ్మెకు దారితీస్తాయని...సమస్యలు పరిష్కరించని పక్షంలో త్వరలోనే సమ్మె బాట పడతామని కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ కన్వీనర్ పాటి సోమిరెడ్డి, కో–కన్వీనర్లు సానికొమ్ము రామచంద్రారెడ్డి, బల్లెం నాగయ్య, ఎండీ యాకూబ్పాషాలు డిమాండ్ చేశారు. సోమవారం రిలేనిరాహారదీక్షలు 12వ రోజుకు చేరుకోవడంతో జేఏసీ సభ్యులు సింగారపు సతీష్, కోడూరు శ్రీనివాసరావు, సందిపాము బాబు, మేకల శేషమ్మ, పడాల మధు, గూడూరు సత్యవతిలు దీక్షల్లో పాల్గొని తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ బాధ్యులు మాట్లాడుతూ రెండు వారాలుగా రిలే నిరాహారదీక్షలు చేస్తున్నా ఐటీసీ యాజమాన్యానికి చీమకుట్టినట్లు కూడా లేదని, కార్మికులన్నా... కార్మిక సమస్యలన్నా అంత చులకనా అంటూ ఐటీసీ తీరుపై మండిపడ్డారు. తక్షణమే 13వ వేతన ఒప్పంద కాలంలో పెండింగ్ సమస్యలు పరిష్కరించి జేఏసీతో 14వ వేతన ఒప్పందం చేయాలని డిమాండ్ చేశారు. ఐటీసీ కాంట్రాక్టు సమస్యలపై చర్చలకు పిలవని పక్షంలో త్వరలోనే సమ్మె బాటపడతామని హెచ్చరించారు. ఈ దీక్షా శిబిరంలో జేఏసీ సభ్యులు, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

## ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం



**బూర్గంపహాడ్,ఏప్రిల్ 6 (ప్రజా జ్యోతి ):** మండల కేంద్రంలోని ప్రధాన కూడలి నందు సోమవారం బూర్గంపహాడ్ గ్రామ సర్పంచ్ మందా నాగరాజు,ఉప సర్పంచ్ గుండె వెంకన్న చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పలు గ్రామాల నుంచి ప్రయాణికులు వస్తుంటారని వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకే ఈ చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ బర్ల ప్రభాకర్,పాలక వర్గ సభ్యులు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యాభివృద్ధికి దాతల సహకారం అభినందనీయం





- ఎమ్మెల్యే జారె

**దమ్మపేట,ఏప్రిల్. 06,(ప్రజాజ్యోతి):** దమ్మపేట మండలం మొద్దులగూడెం గ్రామంలో విద్యాభివృద్ధి, సామాజిక సేవకు ప్రతీకగా నిలిచే కార్యక్రమం ఘనంగా జరిగింది. గ్రామానికి చెందిన బాల రవికుమార్, మోరంపూడి చెన్నారావు సహకారంతో స్థానిక ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన ఆట వస్తువులు, టీవీ ఇతర విద్యా సామగ్రి అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమం గ్రామంలో విద్యార్థుల్లో ఆనందాన్ని నింపడంతో పాటు, వారి అభ్యాసంలో నూతన ఉత్సాహాన్ని కలిగించింది.ఈ సందర్భంగా గౌరవ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ముఖ్య అతిథిగా హాజరై పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని అందజేసిన సామగ్రిని ఆవిష్కరించారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఇటువంటి సేవా కార్యక్రమాలు ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. గ్రామస్థులు, దాతలు విద్యాభివృద్ధి కోసం ముందుకు రావడం ప్రశంసనీయం అని కొనియాడారు.అనంతరం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న వాడపల్లి నవమణిరాజు, పర్వతనేని ప్రభాకరరావు, బాల ప్రమీలారాణి, దొడ్డా సరోజినీ, దొడ్డా సత్యావతిని ఎమ్మెల్యే పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని అవసరమైన సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామ్యం కావడం ప్రజాప్రతినిధుల బాధ్యత అని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బేతం రుక్మిణి, ఎంఈఓ జగపతి, ప్రధానోపాధ్యాయులు డి. శ్రీనివాసరెడ్డి, వార్డు సభ్యులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామ పెద్దలు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఘనంగా బి టి. రణదేవే 36వ వర్ధంతి

- నివాళులు అర్పించిన సిపిఎం పార్టీ చర్ల మండల కమిటీ



**చర్ల, ఏప్రిల్ 06:(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో సోమవారం చర్ల బిఎస్ రామయ్య భవన్లో బి టి ఆర్ కు ఘనమైన నివాళులు సిపిఎం పార్టీ చర్ల మండల కమిటీ ఆరోపించారు.ఈ సందర్భగా సిపిఎం పార్టీ చర్ల మండల కార్యదర్శి మచ్చ రామారావు మాట్లాడుతూ సి ఐ టి యు అఖిల భారత వ్యవస్థాపక అధ్యక్షులు బి. టీ. రాణదేవే అని భారత్ కమ్యూనిస్టు రాజకీయా నాయకుడు అని భారత కార్మికోద్యమా నిర్మాతలో ఒకరు అని భారత కమ్యూనిస్టు ఉద్యమ అగ్రజులు కామ్రేడ్ బీటీ తన దేవే అని పోరాట యోధుడైన సిపిఎం పార్టీ అగ్రనేత ఆయన బ్రిటిష్‌కాలంలోనే బొంబాయిలోని కార్మిక సంఘాల స్థాపించి అనేక పోరాటాలు నాయకత్వం వహించారు అని భారతదేశంలో మొట్టమొదటి అఖిల భారత ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు బాధ్యతగా నిర్వహించిన బి టి ఆర్ మహా ధైర్యశాలి 1931లో గాంధీజీ బొంబాయిలోని ఒక బహిరంగ సభలోని ప్రసంగిస్తున్నప్పుడు బి టి ఆర్ ధైర్యంగా వేదిక ఎక్కి భగత్ సింగ్ ఉరిశిక్ష మీరట్ కుట్ర కేసు విషయంలోనూ గాంధీజీ వైఖరి బహిరంగ గాని విమర్శించారు అని ఆటంకాలు సైతం అవకాశాలకు మార్చుకో గలిగిన నైపుణ్యత అతనివి తనను 1940లో అరెస్టు చేసి జైల్లో ఉంచిన సందర్భం అక్కడ కూడా జైలు ఖైదీల సమస్యపై పోరాటాలను నిర్వహించారు అని అన్నారు .రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు తన జీవితాంతం కార్మిక వర్గ ఐక్య కోసం కృషి చేశారు రాజకీయంగా విభేదాలు ఉన్న కార్మిక వర్గం ఐక్యంగా ఉండాలని ప్రయత్నించారు అని 1974 రైల్వే కార్మికుల ఐక్యం చేసి వైవీ కార్మికుల పోరాటం జాతీయ సమన్వయ ఏర్పాటు చేసి ప్రధాన పాత్రగా పోషిస్తూ 1974లో జరిగిన రైల్వే కార్మికుల సమ్మె భారతదేశ కార్మిక ఉద్యమంలో చరిత్ర సృష్టించింది అని అన్నారు . భారతదేశంలో ప్రజలు కార్మిక వర్గం రైతాంగాన్ని అన్ని వర్గాల ప్రజలు శ్రేయస్సు కోసం నిరంతరం శ్రమించి ఆదర్శన విప్లకారులకు బి టి ఆర్ నేడు బి టి ఆర్ మన మధ్యలో లేకపోయినా ఆయన వదిలి వెళ్ళిన ఆశయాలు కూడా ఇలాగే ఉన్నాయి అని అన్నారు . ఒకపక్క కార్పొరేట్ ఆస్తులు ఇబ్బదిముబ్బాడి గా పోగుపడుతుంటే మరోపక్క ఆకలి పేదరికం ఆకలి చావు రైతాంగ ఆత్మహత్యలు నిరుద్యోగం ఉపాధి రోజురోజుకీ పెరుగుతున్నాయి అని ఈ నేపద్యంలో పాలకులు ప్రజా వ్యతిరేక విధానాలు వ్యతిరేకంగా విశాల ఐక్య కార్మికు ఉద్యమాన్ని నిర్మించడమే బి టి ఆర్ కి మనం అర్పించే నిజమైన నివాళులు అని అన్నారు .ఈ కార్యక్రమంలో శ్యామల వెంకట్, మీసాల రంగారావు ,విశ్వాస గోపాల్ అజిత్ తదితరులు పాల్గొన్నారు.

## హామీని నిలబెట్టుకున్న సర్పంచ్

- చర్ల, ఆర్ కొత్తగూడెంలో 20 ఏళ్ల సమస్యకు పరిష్కారం





**చర్ల, ఏప్రిల్ 06:(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో సోమవారం ఆర్ కొత్తగూడెం గ్రామ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి, ఎన్నికల హామీలను నెరవేరుస్తున్న సర్పంచ్ తుర్రం రవికుమార్, ఉప సర్పంచ్ కాపుల కృష్ణార్జునురావు, వార్డు మెంబర్ కారం సుధాకర్లను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. గత 20 ఏళ్లుగా బురదమయంగా ఉన్న రోడ్డును సిమెంట్ రోడ్డుగా మార్చి, ప్రజల కష్టాలను తీర్చినందుకు కృతజ్ఞతగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.గతంలో ఎందరో నాయకులు హామీలు ఇచ్చి మరిచినా, ప్రస్తుత సర్పంచ్ పదవీ బాధ్యతలు చేపట్టిన ఐదు నెలల స్వల్ప కాలంలోనే మాట నిలబెట్టుకోవడం విశేషం. సిమెంట్ రోడ్డుతో పాటు గ్రామంలో వీధిలైట్లు ఏర్పాటు చేయించడం, నిలిచిపోయిన మిషన్ భగీరథ పనులను పూర్తి చేయించి ఇంటింటికీ తాగునీరు అందించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భగా సర్పంచ్ తుర్రం రవికుమార్ మాట్లాడుతూ చర్ల ,ఆర్ కొత్తగూడెం అభివృద్ధికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందనిఅన్నారు.ఈ కార్యక్రమంలో చింతకాయల నారాయణ, ఇరుకం లక్ష్మీకాంత, చింతకాయల హరిబాబు (టీచర్), కారం తిరుపతిరావు, చింతకాయల స్వరూప, కోర్స నాగేంద్ర కుమారి, మల్లం నరసింహరావు, ఐతేం రాజు, మల్లమ్మ, మల్లం సుశీల,మల్లంగంగా రాజు మల్లం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# అన్ని శాఖల ఇంజనీరింగ్ పనులపై సమీక్ష

- వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశం
- జిల్లా కలెక్టర్ అంకిత్






**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 6 ప్రజా జ్యోతి:** జిల్లాలో వివిధ శాఖల పరిధిలో కొనసాగుతున్న ఇంజనీరింగ్ పనులను వేగవంతం చేసి నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో అన్ని శాఖల ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా మంజూరైన పనులు ఆలస్యం కావడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పనుల్లో జాప్యానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకుంటూ, ఇకపై ఆలస్యం సహించబోమని స్పష్టం చేశారు. ప్రతి పనిని ప్రాధాన్యతగా తీసుకుని వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు.పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అంగన్వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణం, అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు మంజూరు అయి చాలా కాలం గడిచినా పూర్తి చేయకపోవడంపై ప్రశ్నించారు. ఈ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.మిషన్ భగీరథ పరిధిలో తాగునీటి పైప్‌లైన్‌లు, ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణ పనుల పురోగతిపై సమగ్ర నివేదికలు అందించాలని తెలిపారు. పబ్లిక్ హెల్త్, రోడ్లు & భవనాలు, ట్రైబల్ వెల్ఫేర్,విద్యుత్ శాఖల పనుల పురోగతిని సమీక్షిస్తూ శాఖల మధ్య సమన్వయం పెంచి పనులను వేగవంతం చేయాలని సూచించారు.
అటవీ శాఖ అనుమతులు, భూసంబంధిత సమస్యలు వంటి ఆటంకాలు ఉన్నచో వెంటనే పరిష్కరించుకోవాలని, అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. రహదారుల నిర్మాణం, ఇందిర మహిళా శక్తి భవనాలు, యంగ్ ఇండియా పాఠశాలల పనుల పురోగతిని కూడా సమీక్షిస్తూ పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు.ఇరిగేషన్ శాఖ పరిధిలో చేపడుతున్న సీతమ్మ సాగర్, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ల పనుల పురోగతిని కూడా సమీక్షించారు. ప్రాజెక్టులకు సంబంధించిన కాల్వలు, పంప్ హౌస్‌లు తదితర పనులను సమయానికి పూర్తి చేయాలని సూచించారు.అన్ని పనులను నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని, ప్రతి రోజు పనుల పురోగతిపై నివేదికలు సమర్పించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు సమయానికి అందించేందుకు అధికారులు కట్టుబడి పనిచేయాలని కలెక్టర్ అంకిత్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ శాఖ అర్జున్ రావు, పంచాయతీరాజ్ శాఖ ఈ ఈ శ్రీనివాస్, ఆర్ అండ్ బి శాఖ ఈ ఈ నాగేశ్వరరావు, విద్యుత్ శాఖ ఎస్సీ మహేందర్, మిషన్ భగీరథ ఈ ఈ లు తిరుమలేష్, నలిని, పబ్లిక్ హెల్త్ శాఖ డీఈ శ్రీనివాస్ సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

- : కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి





**పాల్వంచ, ఏప్రిల్ 6, ప్రజాజ్యోతి:** పిల్లల ఆరోగ్యవృద్ధి, పోషకాహార మెరుగుదలకు అంగన్వాడీ కేంద్రాలు కీలకమని, వాటిలో సౌకర్యాలు మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని పాత పాల్వంచ 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి తెలిపారు.సోమవారం పాత పాల్వంచ గడియకట్ట ప్రాంతంలోని అంగన్వాడీ కేంద్రాన్ని ఆమె సందర్శించి పరిశీలించారు. "బడికి సిద్ధత" కార్యక్రమం లో భాగంగా పిల్లలతో పాటు వారి తల్లిదండ్రులతో మాట్లాడి, కేంద్రంలో అందుతున్న సేవలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా పిల్లల ఎత్తు, బరువులను తనిఖీ చేసి, పోషకాహార పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. బాలామృతం, కోడి గుడ్లు, పల్లీ చిక్కీలు పిల్లలకు పంపిణీ చేశారు. అలాగే కేంద్ర నిర్వహణకు సంబంధించిన రికార్డులను కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా విమలాదేవి మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రాల బలోపేతమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ నిర్వాహకులు జి. పద్మ, పి. నాగమణి, పి. రాజ్యలక్ష్మి , ఆర్. పి యాటా అరుణ, వార్డు ఆఫీసర్ దామెర్ల నరేష్, ఆయా నాగలక్ష్మి ,అలాగే కాలనీవాసులు మసనం శరత్, బూసి శ్రీను, గడదాసు నాగలక్ష్మి , దాడి కృష్ణవేణి, డి. ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక హక్కుల కోసం పోరాడిన బీటి రణదీవేకు సిఐటియు ఘన నివాళి




**దమ్మపేట,ఏప్రిల్. 06, (ప్రజాజ్యోతి ):** సిఐటియు అఖిల భారత వ్యవస్థాపక అధ్యక్షులు, కార్మిక వర్గానికి అంకితభావంతో సేవలందించిన కామ్రేడ్ బీటి రణదీవే వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో నివాళి సభ నిర్వహించారు.ఈ సందర్భంగా సిఐటియు మండల కన్వీనర్ మురహరి రఘు మాట్లాడుతూ బీటి రణదీవే భారతదేశంలో కార్మిక ఉద్యమాలకు బలమైన పునాది వేసిన మహానేత అని పేర్కొన్నారు. వివిధ రంగాల కార్మికులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి సంఘటిత శక్తిగా మారుస్తూ కార్మిక హక్కుల సాధనలో కీలక పాత్ర పోషించారని తెలిపారు.కార్మిక వర్గం హక్కుల పరిరక్షణ కోసం బీటి రణదీవే చూపిన మార్గంలోనే ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు రామకృష్ణ, రాఘవయ్య, నరసింహారావు, రాంబాబు తదితరులు పాల్గొని బీటి రణదీవే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

# రామాలయ అన్నదానంకు వెళ్లే మార్గంలో రెడ్‌మ్యాట్ ఏర్పాటు



**భద్రాచలం టౌన్ , ఏప్రిల్ 6 , ప్రజాజ్యోతి,** భద్రాచలంలో రామాలయంలో దర్శనం అనంతరం అన్నదాన సత్రంకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం వేసవి కాలం దృష్ట్యా రెడ్‌మ్యాట్‌ను సోమవారం వేసారు. దీంతో ఆలయంలో దర్శనం అనంత రం భక్తులకు అన్నదానం చేసేందుకు రామాలయం మెట్లు దిగి నేరుగా అన్నదా న సత్రంకు వెళ్లేందుకు సౌకర్యవంతంగా ఉంటుంది.

# విద్యుత్ ప్లాంట్ల స్థాపనకు డిమాండ్

- సమగ్ర అభివృద్ధి వేదిక రౌండ్ టేబుల్ సమావేశం.

**పాల్వంచ, ఏప్రిల్ 6, ప్రజాజ్యోతి:** రాష్ట్ర విభజనలో భాగంగా తెలంగాణకు రావాల్సిన విద్యుత్ ప్లాంట్లను పాల్వంచలో ఏర్పాటు చేయాలని సమగ్ర అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది.సోమవారం వర్తక సంఘ భవనంలో జరిగిన ఈ సమావేశం కొండపల్లి శ్రీధర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పలువురు ప్రజా ప్రతినిధులు, సంఘ నాయకులు మాట్లాడుతూ పాల్వంచ–కొత్తగూడెం జంట పట్టణాల అభివృద్ధికి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.తెలంగాణ ఇంజనీరింగ్ అసోసియేషన్ చీఫ్ అడ్వైజర్ బి. మంగీలాల్, ఎన్ఐటియూసి జిల్లా అధ్యక్షుడు ఎం.డి. జలీలు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొండెం వెంకన్న, నాయకులు ఎస్.వి.కే ఆచార్యులు, నూకల రంగారావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మల్లెల రవిచంద్ర, సిపిఐ జిల్లా నాయకుడు ఇట్టి వెంకట్రావు, కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ అహ్మద్ తదితరులు మాట్లాడారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోదావరి, కిన్నెరసాని వంటి జీవనదులు, సింగరేణి బొగ్గు, కేటీపీఎస్, బీటీపీఎస్ వంటి విద్యుత్ వనరులు, ఉన్నత విద్యావంతులు, కష్టపడి పనిచేసే కార్మికులు ఉన్నప్పటికీ పాలకుల నిర్లక్ష్యం వల్ల జిల్లా అభివృద్ధిలో వెనుకబడి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.జిల్లా కేంద్రాలైన పాల్వంచ, కొత్తగూడెంలో వ్యాపారాలు క్షీణించి, దుకాణాలు వెలవెలబోతున్నాయని, వ్యాపారులు అద్దెలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారని, నిరుద్యోగులు ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.ఈ నేపథ్యంలో కేటీపీఎస్ ఎనిమిదో దశ నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలని, రాష్ట్ర విభజన చట్టం ప్రకారం 1700 మెగావాట్ల విద్యుత్ సామర్థ్యాన్ని తెలంగాణకు కేటాయించినందున ప్రభుత్వంపై అదనపు భారం లేకుండానే ఈ ప్రాజెక్టును అమలు చేయవచ్చని స్పష్టం చేశారు. ఇందుకు ప్రభుత్వానికి అవసరమైంది కేవలం చిత్తశుద్ధి మాత్రమేనని పేర్కొన్నారు.అదే విధంగా ఎన్ఎండీసీ, ఏపీ స్టీల్ వంటి మూతపడిన పరిశ్రమలను పునరుద్ధరించాలని, లేకపోతే ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, ఎరువుల కర్మాగారం, సిమెంట్ ఫ్యాక్టరీ, థర్మల్ పవర్ ప్లాంట్లు, వ్యవసాయ ఆధారిత మిర్చి, పత్తి ఆధారిత వస్త్ర పరిశ్రమలు ఏర్పాటు చేస్తే వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగుతాయని సూచించారు.ఈ లక్ష్య సాధన కోసం పాల్వంచ పట్టణ ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బి. కిషోర్, వర్తక సంఘ నాయకులు సంపత్, ప్రవీణ్, నిరుద్యోగ సంఘం నాయకులు ఎస్.కె. మున్నా, వెంకట్, బి. శ్రీను, కె.వి.ఎస్. రాం తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర మహా సభలను జయప్రదం చేయండి




**బూర్గంపహాడ్, ఏప్రిల్ 6 (ప్రజా జ్యోతి ):** కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన వ్యవసాయ చట్టానికి వ్యతిరేకంగా రైతుల హక్కుల కోసం పోరాటం చేస్తున్నామని ఈ క్రమంలో జిల్లా కేంద్రంలో 23, 24, 25 తేదీల్లో నిర్వహించతలపెట్టిన తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర 3వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర నాయకులు కునుసోతు ధర్మ పిలుపునిచ్చారు. సోమవారం మండల పరిధిలోని టేకులచెరువులో జరిగిన మండల మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వ విధానాలను ఎండగట్టి వ్యవసాయాన్ని రక్షించడం కోసం ఢిల్లీలో 13 నెలలపాటు మూడు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా రైతాంగాన్ని సమీకరించి పోరాటం చేసి విజయం సాధించామన్నారు. దేశంలో రైతు సంఘం ప్రధానంగా స్వామినాథన్ కమీషన్ సిఫార్సుల ప్రకారం మద్దతు ధర పంటలకు బీమా సౌకర్యం కల్పించేలా డిమాండ్ చేస్తుందన్నారు. త్వరలో జరగనున్న రైతుసంఘం మహాసభలకు రైతులు పెద్దసంఖ్యలో తరలివచ్చి పోరాట కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభలో సర్పంచ్ బోళ్ల సైదమ్మ, జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల వెంకటేశ్వర్లు, బోళ్ల శ్రీశైలం, కార్యదర్శి కందుకూరి నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శి పాండవుల రామనాధం, ఉపాధ్యక్షులు కొమ్రరాజు సత్యనారాయణ, సభ్యులు నిమ్మల అప్పారావు, దామోదర్ రెడ్డి, పుల్లారెడ్డి, బిక్షమయ్య, రాఘవమ్మ పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధిపై దృష్టి – 99 రోజుల ప్రగతి ప్రణాళిక అమలుపై ఎమ్మెల్యే జారే సమీక్ష

- తాగునీటి సమస్యలపై ముందస్తు చర్యలు – ఇందిరమ్మ ఇళ్లపై దిశా నిర్దేశం





**దమ్మపేట,ఏప్రిల్.06,(ప్రజాజ్యోతి):** దమ్మపేట మండలం పట్వారిగూడెం గ్రామంలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో 99 రోజుల ప్రగతి ప్రణాళిక అమలుపై సమగ్ర సమీక్ష చేపట్టారు. ఎమ్మెల్యే శ్రీ జారె ఆదినారాయణ అధ్యక్షతన చెలికాని ఆదెమ్మ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ సమావేశానికి అశ్వారావుపేట నియోజకవర్గంలోని ఐదు మండలాల అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు,కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.ఈ సందర్భంగా గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారంపై చర్చిస్తూ ఇప్పటికే పరిష్కారమైన అంశాలతో పాటు పెండింగ్‌లో ఉన్న సమస్యలను వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా ఎండాకాలంలో తాగునీటి కొరత రాకుండా ముందుగానే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అవసరమైన చోట్ల బోర్లు త్రవ్వడం, పాడైన పైపులైన్‌లను మరమ్మతు చేయడం వంటి పనులు తక్షణమే ప్రారంభించాలని సూచించారు.అలాగే రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు విషయంలో పారదర్శకత పాటించాలని, అర్హులైన లబ్ధిదారులకు మాత్రమే ఇళ్లు కేటాయించేలా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, శుభ్రత, రహదారుల మెరుగుదలపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించా రు.ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తోందని, అధికారులు–ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పేర్కొన్నారు.

## బార్ అసోసియేషన్ అధ్యక్షుడిని ఘన సన్మానం



**ఇల్లందు, ఏప్రిల్ 6, ప్రజాజ్యోతి:**ఇల్లెందు నూతన బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన భూక్య రవికుమార్ నాయక్ ను సోమవారం ఇల్లందు డిఎస్పి వెంకన్న బాబు, సిఐ తాటిపాముల సురేష్ లు శాలువా, జ్ఞాపకతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డిఎస్పి వెంకన్న బాబు మాట్లాడుతూ బార్ అసోసియేషన్ అభివృద్ధికి కౌన్సిల్ సభ్యుల సమస్యల పరిష్కారానికి ముందుండాలని సూచించారు. న్యాయ సేవ ఎంతో గొప్పదని ప్రజలకు తమ సేవలను అందించడంలో ముందుండాలని కోరారు. ఇల్లెందు బార్ అసోసియేషన్ నూతన కమిటీ నూతన ఓరడితో బార్ సభ్యులను కలుపుకుపోతూ ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు.

## రామాలయ ప్రధాన అర్చకులుగా కోటి రామస్వరూప్ రాఘవాచార్య

- ఉత్తర్వులను అందజేసిన దేవస్థానం ఈవో



**భద్రాచలం టౌన్, ఏప్రిల్ 6 , ప్రజాజ్యోతి,** భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానం ప్రధాన అర్చకుడిగా కోటి రామ స్వరూప్ రాఘవాచార్యను నియమిస్తూ దేవస్థానం వో కె.దామోదర్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఇందుకు సంబంధించిన నియామక పత్రాలను ఈవో రామాలయంలో రాఘవాచార్యకు అందజేశారు. ప్రస్తుత ప్రధాన అర్చకులు పొడిచేటి సీతా రామానుజాచార్యులు మార్చి 31న ఉద్యోగ విరమణ చేయడంతో రామస్వరూప్‌ను నియమించారు.

## పాలవాగు ఆదివాసీలకు సోలార్ దీపాల పంపిణీ



**ములకలపల్లి, ఏప్రిల్ 06, ప్రజాజ్యోతి:** మండలంలోని పాలవాగు వలస ఆదివాసీ గ్రామంలో నివసిస్తున్న 50 కుటుంబాలకు ములకలపల్లి వాసి, వైరా ఎస్సె పుష్పాల రామారావు ఆధ్వర్యంలో, రాబిన్ హుడ్ ఆర్మీ సహకారంతో సుమారు లక్ష రూపాయల విలువైన సోలార్ విద్యుత్ దీపాలు, పదిరోజులకు సరిపడా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. పుష్పాల రామారావు తన తల్లి పుష్పాల ఇందిరమ్మ ద్వితీయ వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి ఆదివాసీల మధ్య ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రెండు ఆదివాసీ గుంపులకు భోజనాలు కూడా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సె పుష్పాల రామారావు మాట్లాడుతూ, తల్లిదండ్రుల జ్ఞాపకార్థం సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఆదివాసీలకు తమ కుటుంబం అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గుండాలపాడు సర్పంచ్ కారం వెంకటేశ్వర్లు, రాబిన్ హుడ్ ఆర్మీ ప్రతినిధులు రమేష్, కిరణ్, పుష్పాల కుటుంబ సభ్యులు వెంకన్న, చందర్ రావు, సాయి, ఐద్వ నాయకురాలు సందకురా లక్ష్మి, మండల ప్రముఖులు నూపా భాస్కర్, బండి కొమరయ్య తదితరులు పాల్గొన్నారు.

## రణదీవే ఆశయాల సాధనకు కార్మికుల ఐక్య పోరాటాలు అవసరం

- సీఐటీయూ మండల కన్వీనర్ నిమ్మల మధు



**ములకలపల్లి, ఏప్రిల్ 06 ప్రజాజ్యోతి:** కార్మికోద్యమ ప్రముఖుడు బి.టి. రణదీవే ఆశయాలను సాధించేందుకు కార్మిక వర్గం ఐక్యంగా పోరాటాలు నిర్వహించాలని సీఐటీయూ మండల కన్వీనర్ నిమ్మల మధు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన రణదీవే వర్ధంతి సభలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిమ్మల మధు మాట్లాడుతూ, రణదీవే కార్మిక సంఘాలను ఏర్పాటు చేసి శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా అనేక పోరాటాలు నడిపారని తెలిపారు. ఆ పోరాటాల ఫలితంగా దేశవ్యాప్తంగా కార్మిక హక్కుల కోసం చట్టాలు అమలులోకి వచ్చాయని చెప్పారు. స్వాతంత్ర్యానికి ముందే బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా కూడా ఆయన కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో కార్మికులు ఐక్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను ఎదిరించాలని ఆయన పిలుపునిచ్చారు. పెరిగిన గ్యాస్ సిలిండర్ ధరలను తగ్గించాలని, అమల్లోకి తెచ్చిన నాలుగు కార్మిక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం నాయకుడు గోపగాని లక్ష్మీనర్సయ్యతో పాటు సీఐటీయూ నాయకులు కుంజా నాగమణి, కీసరి శ్రీలత, పాపమ్మ, బుచ్చమ్మ, మంగ, తిరుపతమ్మ, కళ్యాణి, చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఆడబిడ్డ పెళ్లికి 'సర్పంచ్ సురేష్' భరోసా

**టేకులపల్లి,ఏప్రిల్ 06,ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలం మొక్కంపాడు తండ సర్పంచ్ బానోత్ సురేష్ పంచాయతీ ఎన్నికల సమయంలో తాను ఇచ్చిన మాట ప్రకారం కీలక హామీ అయిన ఆడబిడ్డ పెళ్లి మేనమామ కానుకను సోమవారం 5,016 రూపాయల బానోత్ రమేష్ రమాదేవిల కూతురు పెళ్లికి సర్పంచ్ హాజరై కానుకగా రూ.5,016 నగదు అందించి,నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ సందర్భంగా సర్పంచ్ సురేష్ మాట్లాడుతూ గ్రామస్తులకు ఇచ్చిన ప్రతీ హామీ నెరవేరుస్తానని ఆయన అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తూ, గ్రామ స్తులకు కొందరికి అందని హామీ చేస్తానని ఆయన వెల్లడించారు.ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబెర్స్,గ్రామ యువకులు పాల్గొన్నారు.



## బడిబాటకు శ్రీకారం.. నమోదు కర పత్రం ఆవిష్కరణ

- ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల విస్తరణ, నాణ్యమైన విద్యకు దిశానిర్దేశం







**అన్నపురెడ్డిపల్లి, ఏప్రిల్ 6,ప్రజా జ్యోతి:**అశ్వారావుపేట నియోజకవర్గం పరిధిలోని అన్నపురెడ్డిపల్లి మండలం ఎర్రగుంట ఉన్నత పాఠశాలలో 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట ప్రత్యేక నమోదు కార్యక్రమ కరపత్రాన్ని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.ఈ సందర్భంగా ఒడ్డుగూడెం, మర్రిగూడెం, అబ్బుగూడెం పాఠశాలల్లో ప్రహరీ గోడల నిర్మాణ పనులను ప్రారంభించినట్లు వెల్లడించారు. పాఠశాలల అభివృద్ధి ద్వారా విద్యా వాతావరణాన్ని మెరుగుపరచడం లక్ష్యంగా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో మండల అభివృద్ధి అధికారి కావూరి మహాలక్ష్మి, మండల పరిషత్ అధికారి షైక్ షబానా, పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ విజయసింహ రెడ్డి, పెద్దిరెడ్డిగూడెం గ్రామ సర్పంచ్ సున్నం నాగభూషణం, ఉప సర్పంచ్ వేముల నరేష్, పర్సా వెంకటేశ్వర్లు, గ్రామ పెద్దలు వేముల రమణ, సయ్యద్ అహ్మద్, షైక్ దస్తగిరి, ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు శంకర మహదేవన్, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# పాల్వంచలో 'హైటెక్ వ్యభిచార' ముఠా బండారం

- **విద్యార్థినులు, గృహిణులే లక్ష్యం – ఫోటోలతో బ్లాక్‌మెయిల్ ఆరోపణలు**



**పాల్వంచ, ఏప్రిల్ 6, ప్రజాజ్యోతి:** పారిశ్రామిక కేంద్రంగా పేరుగాంచిన పాల్వంచ పట్టణంలో హైటెక్ విధానాలతో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. అమాయక విద్యార్థినులు, గృహిణులను లక్ష్యంగా చేసుకుని మోసపూరితంగా దందా నడుపుతున్నట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది. పట్టణంలోని ఇందిరానగర్, కాంట్రాక్టర్స్ కాలనీ ప్రాంతాల్లో అద్దె ఇళ్లను కేంద్రంగా చేసుకుని ఈ అక్రమ కార్యకలాపాలు సాగుతున్నాయని సమాచారం. ముఖ్యంగా బయట ప్రాంతాల నుంచి వచ్చి హాస్టళ్లలో ఉంటూ చదువుకునే విద్యార్థినులను ఆర్థిక ఇబ్బందులను ఉపయోగించుకుని మోసగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. "తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు" అనే ఆశ చూపిస్తూ బాధితులను వలలో వేసుకుని, అనంతరం వారిని ఈ దందాలోకి దింపుతున్నారని తెలుస్తోంది. కొంతమంది గృహిణులను కూడా ఆర్థిక అవసరాల పేరుతో ఇందులోకి లాగుతున్నట్లు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంలో బ్లాక్‌మెయిలింగ్ కీలక పాత్ర పోషిస్తున్నట్లు సమాచారం. బాధితులు బయటకు రావాలని ప్రయత్నిస్తే, వారి ఫోటోలు, వీడియోలను సామాజిక మాధ్యమాల్లో పెట్టేస్తామని లేదా కుటుంబ సభ్యులకు పంపిస్తామని బెదిరింపులకు దిగుతున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పరువు భయం కారణంగా బాధితులు బయటకు రాలేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలుస్తోంది. టెక్నాలజీ సహాయంతో వాట్సాప్ ద్వారా ఫోటోలు పంపించడం, వీడియో కాల్స్ నిర్వహించడం ద్వారా కస్టమర్లను సంప్రదిస్తున్నట్లు సమాచారం. ఒక్కొక్కరి నుండి రూ.10,000 నుండి రూ.30,000 వరకు వసూలు చేస్తున్నారని, బాధితులకు తక్కువ మొత్తమే అందిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల ఈ వేధింపులను భరించలేక ఓ మహిళ జిల్లా ఎస్పీని ఆశ్రయించి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. పాల్వంచతో పాటు జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో కూడా ఇలాంటి ముఠాలు ఉన్నాయని అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో, పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ ఘటనకు సంబంధించి అధికారికంగా పోలీసులు పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంది.

## సోమవారం సందర్భంగా మల్లికార్జున స్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు

- **రుద్రాభిషేకాలు, మహా అన్నదానంతో ఆలయంలో భక్తుల రద్దీ**



**అన్నపురెడ్డిపల్లి, ఏప్రిల్ 6,ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారి ఆలయంలో సోమవారాన్ని పురస్కరించుకొని మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకాలు, ప్రత్యేక అభిషేక కార్యక్రమాలు వైభవంగా నిర్వహించబడ్డాయి.





ఆలయం మొత్తం భక్తి పరవశంతో మార్మోగింది. శివారాధనలో అభిషేకాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. ఉదయం వేళల నుంచే పాలు, పెరుగు, తేనె, చక్కెర, నెయ్యి వంటి పంచామృతాలతో స్వామివారికి అభిషేకం నిర్వహించారు. బిల్వదళాలతో పూజలు చేయడం శివునికి అత్యంత ప్రీతికరమని భావిస్తారు. రుద్ర పారాయణం, లింగాభిషేకం ద్వారా భక్తులు తమ కోరికలను వ్యక్తం చేస్తారు. శివుని దర్శనం ఆధ్యాత్మిక శాంతిని కలిగిస్తుందని భక్తుల నమ్మకం. ఉపవాసంతో శివార్చన చేయడం ద్వారా శ్రేయస్సు కలుగుతుందని పురాణాలు చెబుతున్నాయి. శివనామ స్మరణతో మనసుకు ప్రశాంతత లభిస్తుంది. అనంతరం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించబడింది. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మహాప్రసాదాన్ని స్వీకరించారు. గ్రామస్తులు, సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు విశేషంగా పాల్గొన్నారు. స్వామివారి సేవలో ఆలయ మేనేజర్ పివి రమణ, చైర్మన్ మల్యాల నరసింహారావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఈదురుగాలులతో.. ఆగమాగం

- **కూలినచెట్లు, విరిగిపడిన విద్యుత్ స్తంభాలు, కూలిపోయిన రేకుల షెడ్డులు**





**అశ్వారావుపేట, ఏప్రిల్ 06, ప్రజాజ్యోతి:** మండల వ్యాప్తంగా పగలంతా ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరైనా ప్రజలకు సోమవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం బీభత్సం సృష్టించింది. ఒక్కసారిగా వాతావరణం మారి భారీ ఈదురుగాలులతో వర్షం పడడంతో గాలుల తీవ్రతకు పలుచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ఫార్మర్లు విరిగిపడ్డాయి విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలగటంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఉద్యానవన పంటలు వేసిన రైతులకు నష్టం వాటిల్లింది. మున్సిపాలిటీ పరిధిలోని తొమ్మిదవ వార్డ్ నందమూరి కాలనీలో రేకుల షెడ్లు ఎగిరిపోయావటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలుచోట్ల విద్యుత్ స్తంభలు విరిగిపోయాయి.

## అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం పంపిణీ – లబ్ధిదారులకు అవగాహన



**దమ్మపేట,ఏప్రిల్.06,(ప్రజాజ్యోతి):** దమ్మపేట పంచాయితీ పరిధిలోని పలు అంగన్వాడీ కేంద్రాల్లో సోమవారం ప్రత్యేక కమిటీ సభ్యుల సమక్షంలో బాలింతలు, గర్భిణీలు, యుక్తవయసు బాలికలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పిల్లల బరువులను నమోదు చేసి వారి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. ప్రత్యేక కమిటీ సభ్యులు మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో ఫేస్ రికగ్నిజేషన్ విధానం ద్వారా లబ్ధిదారుల హాజరు నమోదు చేసి, దాని ఆధారంగా పౌష్టికాహారం పంపిణీ జరగనున్నదని తెలిపారు. ప్రతీ నెల 10వ తేదీ లోపు అంగన్వాడీ కేంద్రానికి వచ్చి ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని లబ్ధిదారులు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు.గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లల ఆరోగ్య పరిరక్షణ కోసం పౌష్టికాహారం పంపిణీతో పాటు ప్రీ–స్కూల్ కార్యకలాపాలు సమర్థంగా నిర్వహించేందుకు ప్రభుత్వం స్థానిక కమిటీల పర్యవేక్షణ ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పగడాల రమాదేవి, రాంబాబు, ఉప సర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు, వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, పసుమర్తి కుసుమాంబ, చిన్నశెట్టి నాగలక్ష్మి , కొత్తపేట ఎం.పి.పి.ఎస్ టీచర్, అంగన్వాడీ టీచర్లు పాశం శాంతి కుమారి, గోళ్ళ సీతారావమ్మ, బేగం పాల్గొన్నారు.

## ఘనంగా 47వ బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



**టేకులపల్లి,ఏప్రిల్06,ప్రజా జ్యోతి:** మండలం కేంద్రం లోని బీజేపీ 47వ ఆవిర్భావ దినోత్సవాని భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు తేజావత్ శంభు నాయక్ ఆధ్వర్యంలో సోమవారం బీజేపీ జెండా ఆవిష్కరించి వేడుకలుఘనంగా నిర్వహించారు.1980లో భారతీయ జనతా పార్టీ ప్రారంభోత్సవం నుంచి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని అంచలంచెలుగా ఎదిగి ప్రస్తుతం ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ శక్తివంత మైన పార్టీగా నిలిచింది. ఏకాత్మజాతీయ వాద సిద్ధాంతాలం పునాదులపై ఏర్పడి నమ్మకాలిన ప్రపంచ ధోరణిలకు అనుగుణంగా దేశ ప్రగతి ప్రజా సంక్షేమం నయా సాంకేతిక నైపుణ్యాలు ఆధారంగా వికాసిత్ భారత్ నిర్మాణాన్ని చేపట్టి అన్ని వర్గాల ప్రజలను ఈ మహా యజ్ఞంలో భాగస్వామ్యం చేసి భారత్ ను విశ్వ గురువుగా నిలబెట్టాలని అంకుటిత దేశ యోగక్షేమానికి అంకితమైన ప్రపంచంలో అత్యంత ప్రజా ధారణ కలిగిన భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపక దినోత్సవ సందర్భంగా కార్యకర్తలు మిఠాయిలు పంచి సంబురాలు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఇల్లందు నియోజకవర్గం నాయకులు బోడ పూన్య నాయక్,పార్టీ సీనియర్ నాయకులు ద్రావ్ సింగ్, నెల్లూరి సత్యం, చిక్కా వెంకటేశ్వర్లు,ప్రధాన కార్యదర్శి సురేష్ నాయక్, నాగేందర్, రాందాస్,గంగా తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో ఆహార భద్రత అవగాహన కార్యక్రమాలు: ఆహార భద్రత అధికారి శరత్

**లక్ష్మీదేవిపల్లి, ఏప్రిల్ 6 ( ప్రజాజ్యోతి )** జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆహార భద్రతపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు పలు కార్యక్రమాలు నిర్వహించినట్లు జిల్లా ఆహార భద్రత అధికారి శరత్ తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవిపల్లి నుండి కొత్తగూడెం రైల్వే స్టేషన్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించగా సుమారు 75 మంది పాల్గొన్నారు. ర్యాలీ ద్వారా సురక్షిత ఆహారం వినియోగం, పరిశుభ్రత ప్రమాణాల ప్రాముఖ్యత, నాణ్యమైన ఆహార పదార్థాల ఎంపికపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన ఎక్స్‌పోలో ఆహార భద్రతా నియమాలు, ప్రభుత్వ మార్గదర్శకాలు, అందుబాటులో ఉన్న సేవలపై అధికారులు వివరించారు. పాల్గొన్న వారికి ప్రత్యక్షంగా అవగాహన కల్పిస్తూ వారి సందేహాలను నివృత్తి చేశారు. ఇక నమోదు మేళా నిర్వహించి అర్హులైన లబ్ధిదారులను నమోదు చేసి, ప్రభుత్వ పథకాల సద్వినియోగంపై మార్గదర్శకాలు అందించారు. అదేవిధంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ వసతి గృహాల వంట కార్మికులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించి, పోషకాహారం తయారీ, పరిశుభ్రత ప్రమాణాలు, ఆహార భద్రతా నియమాలపై సమగ్ర అవగాహన కల్పించారు.





అనంతరం వారికి రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేశారు.

## జుమ్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సానిటరీ ఫ్యాట్స్ పంపిణీ



**టేకులపల్లి,ఏప్రిల్ 06,ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలం ప్రెగళ్లపాడు జెడ్‌పీ హైస్కూల్ లో ఆరవతరగతి నుండి 10వ తరగతి చదువుతున్న 35 మంది బాలికలకు,ప్రతి ఒక్కరికి 3 శానిటరీ ప్యాడ్స్ చొప్పున జుమ్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలోజుమ్మి ఫౌండేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కమల టేకులపల్లి మండలంలో జుమ్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాలుగు పాఠశాలలో ( జెడ్పీఎస్ఎస్ బోడు, జెడ్పీఎస్ఎస్ బేతంపూడి, జడ్పీఎస్ఎస్ సులానగర్,జడ్పీఎస్ఎస్ ముత్యాలంపాడు )లో చదువుతున్న ఆరవ తరగతి నుండచి పదవతరగతి బాలికలకు మూడు శానిటరీ ఫ్యాట్స్ అందజేసీ,బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత(పర్సనల్ హైజీన్),మెన్స్రువల్ హైజీన్ గురించి అవగాహన కల్పిస్తూ,శానిటరీ ప్యాడ్స్ వినియోగం, దాని అవసరం గురుంచి బాలికలకు వివరించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయు లు దారావత్ రామచంద్ర సింగ్, లాలు సిబ్బంది పాల్గొన్నారు.

## పినపాక శాసనసభ సభ్యులను మర్యాద పూర్వకంగా కలసిన కాంగ్రెస్ నాయకులు



**ఆళ్లపల్లి,ఏప్రిల్ 6.ప్రజాజ్యోతి**పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు. ఆళ్లపల్లి మండల కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.మర్కోడు గ్రామ పంచాయతీలో నూతనంగా నిర్మిస్తున్న కనకదుర్గాదేవి ఆలయం వద్ద మరియు ఎస్సీ కాలనీలోని ముత్యాలమ్మ గుడి వద్ద నీటి సౌకర్యం కోసం బోర్లు (చేతి పంపులు ) వేయించాలని నాయకులు ఎమ్మెల్యేను కోరారు.దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే, రాబోయే 10 రోజుల్లోనే రెండు చోట్లా బోర్లు వేయిస్తానని హామీ ఇచ్చారు. ప్రజల అవసరాలను గుర్తించి తక్షణమే స్పందించిన ఎమ్మెల్యేకు నాయకులు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పడిగ సమ్మయ్య (ఆళ్లపల్లి మండల మాజీ ఎంపీపీ) సుతారి కృష్ణ (మండల సీనియర్ నాయకులు )తాటి పెద్ద నీలమయ్య (కాంగ్రెస్ పార్టీ నాయకులు, పెద్ద వెంకటాపురం )చందా హరికృష్ణ (కాంగ్రెస్ పార్టీ నాయకులు, పెద్ద వెంకటాపురం )తదితరులు పాల్గొన్నారు.

# కొత్తగూడెంలో బాక్స్ క్రికెట్ ప్రారంభం

- క్రీడలతోనే దేశానికి ప్రాతినిధ్యం: సాబీర్ పాషా

**కొత్తగూడెం, ఏప్రిల్ 6 ( ప్రజాజ్యోతి )** యువత క్రీడల ద్వారా దేశానికి ప్రాతినిధ్యం వహించే స్థాయికి ఎదగవచ్చని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా అన్నారు. కొత్తగూడెం మున్సిపల్ పరిధిలోని 11వ డివిజన్ పాత కొత్తగూడెం ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఎస్ అండ్ టి–బూమ్ బూమ్ స్ట్రైకర్స్ బాక్స్ క్రికెట్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. ప్రతిరోజూ క్రీడలకు సమయం కేటాయిస్తే ఏకాగ్రత పెరిగి మంచి భవిష్యత్తు సాధించవచ్చని చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండా





లంటే క్రీడలే ఉత్తమ మార్గమని పేర్కొన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లలను క్రీడల వైపు ప్రోత్సహించాలని సూచించారు. మేయర్ మూడ్ గణేష్ మాట్లాడుతూ యువతకు ఇలాంటి బాక్స్ క్రికెట్ వేదికలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. తమ ప్రతిభను మెరుగుపరుచుకునేందుకు యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్పొరేటర్ పడాల ఆకాంక్ష మాట్లాడుతూ చిన్నతనం నుంచే క్రీడలపై శ్రద్ధ పెడితే భవిష్యత్తులో మంచి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా సాబీర్ పాషా బ్యాటింగ్ చేయగా, మేయర్ గణేష్ బౌలింగ్ చేసి క్రీడలను ప్రారంభించారు. నిర్వాహకులు డి. వెంకటస్వామి, మహమ్మద్ అస్లాం అతిథులను సన్మానించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## బీటి రణదీవే వర్ధంతి సందర్భంగా సిపిఎం ఘన నివాళులు



**దమ్మపేట,ఏప్రిల్.06,(ప్రజాజ్యోతి):** స్వాతంత్ర్య సమరయోధుడు, భారత కమ్యూనిస్టు ఉద్యమ ప్రముఖుడు, సిపిఎం పార్టీ నవరత్నాలలో ఒకరైన కామ్రేడ్ బీటి రణదీవే 36వ వర్ధంతిని సోమవారం సిపిఎం పార్టీ కార్యాలయం సుందరయ్య భవనంలో నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు బీటి రణదీవే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. పార్టీ కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు ముందుగా నివాళులర్పించారు.తరువాత జరిగిన సభలో మోరంపూడి శ్రీనివాసరావు, దొడ్డ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ బీటి రణదీవే భారత కమ్యూనిస్టు పార్టీ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని, తరువాత సిపిఎం పార్టీ ఏర్పాటులో ముఖ్య నాయకుడిగా నిలిచారని పేర్కొన్నారు.కార్మిక వర్గ హక్కుల కోసం కృషి చేసి, సిఐటియు కార్మిక సంఘాన్ని స్థాపించిన నాయకుడిగా ఆయన సేవలను కొనియాడారు. ఆయన ఆశయాలను కొనసాగించడం ప్రతి కార్యకర్త బాధ్యత అని అన్నారు.ఈ కార్యక్రమంలో కొప్పుల శ్రీనివాసరావు, కొలికిపోగు శ్రీనివాసరావు, సిహెచ్ బ్రహ్మయ్య, తోలం పవన్ కుమార్, వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

## భద్రాచలంలో బీఎస్పీ ప్రచార కరపత్రాల ఆవిష్కరణ

- ఓరుగల్లు పోరు గర్జనను విజయవంతం చేయాలి



**భద్రాచలం టౌన్, ఏప్రిల్ 06 , ప్రజాజ్యోతి,** ఈ నెల 14న హనుమకొండలో జరిగే ఓరుగల్లు పోరు గర్జన బహిరంగ సభకు సంబంధించిన ప్రచార కరపత్రాలను సోమవారం భద్రాచలంలో బజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు కోళ్లపూడి ప్రవీన్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని బహుజనుల హక్కుల సాధన కోసం వరంగల్ జిల్లా హనుమకొండలో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నామని, భద్రాచలం నియోజకవర్గంతో పాటు జిల్లా నలుమూలల నుండి ప్రజలు, పార్టీ శ్రేణులు వేల సంఖ్యలో తరలివచ్చి ఈ సభను జయప్రదం చేయాలని కోరారు. అంబేద్కర్ ఆశయ సాధనలో భాగంగా బహుజనుల గళాన్ని వినిపించేందుకు నిర్వహిస్తున్న ఈ పోరు గర్జన సభ చారిత్రాత్మకం కాబోతోందనీ. ప్రతి కార్యకర్త బాధ్యతగా ప్రజలను చైతన్యపరచాలనీ అన్నారు ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ జిల్లా ఇన్చార్జి తాండ్ర వెంకటేశ్వర్లు, తడికల శివకుమార్, సిద్ధార్థ పూలే, కొండా చరణ్ , కేసు పాక కృష్ణ, కొప్పుల నారాయణ, ఎస్ కే భాషా, చెన్నం మోహన్, మైనం ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

## మండలంలో అభివృద్ధి పనులకు శ్రీకారం

- సంక్షేమ పథకాల చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే జారె ఆదినారాయణ
- పాఠశాలలు, రహదారులు, ఇందిరమ్మ ఇళ్ల పనులు ప్రారంభం
- కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

**అన్నపురెడ్డిపల్లి, ఏప్రిల్ 6,ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండలంలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ విస్తృతంగా పర్యటించి ఒకవైపు పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టగా, మరోవైపు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందజేశారు.మండలంలోని తొట్టిపంపు, మర్రిగూడెం, అబ్బుగూడెం గ్రామపంచాయతీలలో ప్రాథమిక పాఠశాలలకు ప్రహరీ గోడల నిర్మాణానికి



శంకుస్థాపనలు చేశారు. గ్రామాల్లో నిర్మాణం పూర్తయిన రహదారులను ప్రారంభించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకున్న లబ్ధిదారుల గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. పేదలకు సొంతింటి కల నెరవేర్చడం ప్రభుత్వ లక్ష్యమని, అర్హత గల ప్రతి కుటుంబానికి వచ్చే మూడు సంవత్సరాల్లో ఇళ్లను మంజూరు చేస్తామని తెలిపారు.ఇక మండల కేంద్రంలోని ఎమ్మార్వో కార్యాలయంలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కులు, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులకు అందజేశారు. ఆడపిల్లల పెళ్లికి ఆర్థిక సహాయం అందిస్తూ ప్రభుత్వం అనేక కుటుంబాలకు తోడ్పడుతోందని చెప్పారు. దరఖాస్తు చేసిన కొద్ది రోజుల్లోనే నిధులు మంజూరు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సహాయం అందించడం ప్రభుత్వం బాధ్యతగా కొనసాగుతోందని తెలిపారు.ఈ కార్యక్రమాల్లో అన్నపురెడ్డిపల్లి సర్పంచ్ లాకావత్ లక్ష్మి, మండల అభివృద్ధి అధికారి మహాలక్ష్మి, ఎంపీఓ షబానా, డిప్యూటీ తహసీల్దార్ జగదీశ్వరి, ఎంఈఓ ఆనంద్ కుమార్, కాంగ్రెస్ నాయకులు పర్సా వెంకటేశ్వర్లు, భానోత్ భీముడు, ఇతర నాయకులు, ఆయా గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.